



రాష్ట్రంలో గాడితప్పిన పాలన

- విశాఖపట్నం టీడీపీ ఎంపీ అభ్యర్థి ఎం.శ్రీభరత్
- ఓటు అనే ఆయుధంతో దుష్టులను రాష్ట్రం నుంచి తరిమికొట్టాలి: ఎమ్మెల్యే వెలగపూడి - 4లో





బుగ్గన చుక్కతో అప్పన్నస్వామి

ఏప్రిల్ 19న అప్పన్న కళ్యాణం

- 9న పెళ్లిరాట ఉత్సవం

సింహాచల వరాహ లక్ష్మీనృసింహస్వామి కల్యాణం ఆదివారం తదితర ఏడు గ్రామాల దేవత, అప్పన్న సహోదరి పైడితల్లి అమ్మవారి కుమార్తె శ్రీమహాలక్ష్మీతో నిశ్చయమైంది. సోమవారం ఉదయం కొండదిగువన అప్పన్న పెళ్లిచూపులు జరిగాయి. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా చైత్రమాస శుక్లపక్ష ఏకాదశి నాడు అంటే ఏప్రిల్ 19వ తేదీన సింహాద్రినాథుని వార్షిక తిరుకల్యాణ మహోత్సవం జరగనుంది. అంతకుముందు చైత్రమాస పాడ్యమి అనగా ఏప్రిల్ 9వ తేదీ ఉగాదినాడు పందిరి రాట ఉత్సవం నిర్వహిస్తారు. - వార్త IIIలో

హోలీ.. రంగులకేళి



పార్క్ హోటల్‌లో రైన్ డ్యాన్స్



ఆర్కే బీచ్‌లో హోలి వేడుకలు

నగర పరిధిలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. బీచ్‌రోడ్డుతోపాటు అనేక ప్రాంతాల్లో యువత రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. హోలీ వేడుకల కోసం అనేక ప్రాంతాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. యువతీయువకులు రెయిన్ డ్యాన్స్ చేస్తూ ఎంజాయ్ చేశారు. అపార్టుమెంట్లలో కూడా హోలీ సెలబ్రేట్ చేసుకున్నారు.

విమ్స్ అప్‌గ్రేడ్ అటకెక్కినట్టేనా!?



రూ.250 కోట్లతో ఆరు బ్లాకులు నిర్మిస్తామని రెండేళ్ల క్రితం ప్రకటించిన ప్రభుత్వం

- ఏడాది క్రితం టెండర్ల ప్రక్రియ పూర్తి
- ఇప్పటికీ మొదలుకాని పనులు
- పూర్తిస్థాయి వైద్య నిపుణులను నియమిస్తామన్న హామీ కూడా నెరవేరని వైనం
- బెడ్స్ పెంపుపైనా అదేతీరు
- కార్యరూపం దాల్చని పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)ను పూర్తిస్థాయిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వ ప్రకటన కార్యరూపం దాల్చలేదు. సుమారు రూ.250 కోట్లు వెచ్చించి విమ్స్‌లో రెండో దశ (ఆరు బ్లాకుల్లో కొత్త భవనాలను) నిర్మాణం చేపడతామని వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. పదికిపైగా సూపర్ స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటుచేయడంతో పాటు పూర్తిస్థాయి వైద్య నిపుణులను నియమిస్తామని పేర్కొంది. అయితే, ఈ ప్రకటన చేసి రెండేళ్లు పూర్తి కావస్తున్నా ఆచరణలో ఒక్క అడుగు ముందుకుపడలేదు. సుమారు ఏడాది కిందట టెండర్లు ప్రక్రియ పూర్తయ్యింది. ఆ తరువాత ఏమైందో నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో విమ్స్ అప్‌గ్రేడేషన్ నిలిచిపోయిందని వైద్య వర్గాలు పేర్కొంటున్నాయి.

సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన విమ్స్‌ను అభివృద్ధి చేయడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఉంది. కానీ, ఆ దిశగా ప్రభుత్వం ఆలోచించడం లేదు. ప్రస్తుతం విమ్స్‌లో 30 విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. వీటిలో ఆరు వరకు సూపర్ స్పెషాలిటీ విభాగాలు ఉన్నాయి. అయితే, ఇక్కడ పనిచేసే వైద్యులంతా కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్నవారే. పూర్తిస్థాయి వైద్యులు లేకపోవడంతో ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదు. ప్రభుత్వం అప్‌గ్రేడేషన్‌లో భాగంగానే పూర్తిస్థాయి వైద్య నిపుణులను నియమిస్తామని చెప్పిన మాటను ఇప్పటివరకూ నిలబెట్టుకోలేకపోయింది.

800 బెడ్స్‌కు విస్తరణ

విమ్స్‌ను 800 పడకల ఆస్పత్రిగా విస్తరిస్తామని ప్రభుత్వం, ఆరోగ్య శాఖా మంత్రి గతంలో చెప్పారు. అయితే, ఈ ప్రతిపాదన కూడా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికీ విమ్స్‌లో 450 పడకలు మాత్రమే ఉన్నాయి. పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బందిని నియమించకపోవడం వల్ల రోగులకు మెరుగైన సేవలు అందడం లేదంటున్నారు. ప్రస్తుతం ఉన్న బెడ్ల సంఖ్యను, అందుకు అనుగుణంగా వైద్య సిబ్బందిని పెంచడం ద్వారా మరింతమందికి సేవలు అందించే అవకాశం ఏర్పడుతుంది.

పీజీ మెడికల్ కాలేజీ హామీ కూడా..

విమ్స్‌లో పీజీ మెడికల్ కాలేజీ ఏర్పాటుచేస్తామని గతంలో ప్రకటించారు. సుమారు మూడేళ్ల కిందట ఈ మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టారు. ఆరోగ్యశాఖ అధికారులు సమీక్షించి ఏడాదిలో ప్రక్రియ పూర్తవుతుందని విమ్స్ అధికారులకు సమాచారాన్ని పంపించారు. అన్నీ సవ్యంగా సాగితే ఈ ఏడాదిలో అడ్మిషన్లు జరగాల్సింది. కానీ, కారణమేమిటో గానీ పీజీ మెడికల్ కళాశాలకు కూడా గ్రీన్‌సిగ్నల్ రాలేదు.

రహదారి పనుల్లో నాణ్యతాలోపం

- వన్‌టౌన్‌లో ఇష్టారాజ్యంగా కాలువల నిర్మాణం
- జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ నిల్



ఐరన్ లేకుండా కాలువల నిర్మాణం

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):

నగరంలో రహదారి విస్తరణ పనులను కాంట్రాక్టర్లు ఇష్టానుసారం చేస్తున్నారు. ఏమాత్రం నాణ్యత ఉండడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వన్‌టౌన్‌లో ఈ తరహా నిర్మాణాలు కనిపిస్తున్నాయి. చాలాకాలం తరువాత జగదాంబ జంక్షన్ నుంచి పాత పోస్టాఫీసు వరకు రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రహదారిని 60 అడుగులకు విస్తరించడంతో పాటు మధ్యలో మీడియన్, అటు ఇటు కాలువల నిర్మాణానికి అంచనాలు తయారుచేశారు. అడ్డం వచ్చిన నిర్మాణాలను అవసరం మేరకు తొలగించారు. కొందరికే టీడీఆర్‌లు ఇచ్చి మిగిలిన వారికి హక్కు పత్రాలు చూపించాలంటూ వేధిస్తున్నారు. ఇక్కడ 38, 39 వార్డుల్లో రహదారి విస్తరణ, కాలువల నిర్మాణం పనులు రూ.83 లక్షలతో చేపట్టారు. ముందు ... మిగతా 4వ పేజీలో

నాడు-నేడుకు సిమెంట్ కొరత

బకాయిలు విడుదల కాకపోవడంతో చేతులెత్తేసిన కాంట్రాక్టు సంస్థ

- బహిరంగ మార్కెట్‌లో కొనుగోలుకు విద్యా శాఖ ససేమిరా
- ఎక్కడికక్కడ నిలిచిపోయిన పనులు

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):

ప్రభుత్వ పాఠశాలల్లో 'నాడు-నేడు' పథకం పనులకు సిమెంటు కొరత ఏర్పడింది. ఇటు కాంట్రాక్టర్ సరఫరా చేయడం లేదు. బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు పాఠశాల విద్యా శాఖ అధికారులు అంగీకరించడం లేదు. దీంతో ఎక్కడికక్కడ పనులు నిలిపివేయాల్సి పరిస్థితి ఎదురవుతోంది.

నాడు-నేడు పథకం రెండో దశలో జిల్లాలోని 309 పాఠశాలలు, ఎనిమిది జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.122.77 కోట్లు మంజూరుచేసింది. ఏడాది క్రితం ప్రారంభమైన ఈ పనులు ఆది నుంచీ నత్తనడకన సాగుతున్నాయి. పనులకు అవసరమైన సిమెంటు, ఇనుము, ఇసుకను ప్రభుత్వమే సరఫరా చేస్తామని చెప్పింది. ఇందులో భాగంగా గత ఏడాది పాఠశాలల వారీగా ఇనుము సరఫరా చేసింది. కానీ సిమెంట్ కొన్ని పాఠశాలలకు అందివ్వగా, మరికొన్ని పాఠశాలలకు పూర్తిగా సరఫరా చేయలేదు. జిల్లా యంత్రాంగం అనుమతితో అవసరం మేరకు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి పనులు చేపట్టారు. ఈ మేరకు కొంత మొత్తం పాఠశాల కమిటీ ఖాతాలకు జమ చేసిన ప్రభుత్వం తరువాత నిధులు నిలిపివేయడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో పాఠశాలల ఆవరణలు చిందరవందరంగా ఉన్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం మరో నెల రోజుల్లో ముగియనున్నందున హడావుడి ప్రభుత్వం నిధులు విడుదల చేసింది.

సరఫరా చేయలేమన్న కంపెనీ

ప్రాథమిక పాఠశాలలకు రూ.లక్ష నుంచి రెండు లక్షలు, ఉన్నత పాఠశాలలకు రూ.3 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పాఠశాల కమిటీ ఖాతాల్లోకి జమ చేశారు. అయితే ప్రతి పాఠశాలలో మధ్యలో నిలిచిన పనులు పూర్తిచేయాలంటే సిమెంటు అవసరం. నిధులు విడుదల చేసిన ప్రభుత్వం, గతంలో సరఫరా చేసిన కంపెనీయే సిమెంట్ సరఫరా చేస్తుందని తెలిపింది. అయితే బకాయిలు విడుదల చేయకపోవడంతో సిమెంట్ ఇవ్వలేమని సంబంధిత కంపెనీ చేతులెత్తేసిందనే వాదన వినిపిస్తోంది. ఇదే సమయంలో పనులు పూర్తికి స్థానికంగా కొనుగోలు చేద్దామంటే అధికారులు అంగీకరించడం లేదు. ఇలా అయితే నిర్దేశించిన సమయంలో పనులు ఎలా పూర్తవుతాయని పద్మనాభం మండలానికి చెందిన ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రశ్నించారు.

రెండో దశలో 36.07 శాతమే ఖర్చు

రెండోదశలో జిల్లాలోని 309 పాఠశాలల్లో పనుల కోసం రూ.114.79 కోట్లతో చేపట్టిన ప్రతిపాదనలకుగాను ఇంత వరకు రూ.40.17 కోట్ల విలువైన సిమెంట్, ఇనుము, ఇసుక, ఇతర మెటీరియల్ పంపారు. వీటిలో సిమెంట్ పూర్తిగా వినియోగించగా ఎక్కువ ... మిగతా 4వ పేజీలో

సిగరెట్ల మాఫియా

ఒకవైపు నకిలీ సిగరెట్లు.. మరోవైపు ఈ-సిగరెట్లు

- ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న కొంతమంది వ్యాపారులు
- ప్రతినెలా రూ.80 కోట్ల నకిలీ సిగరెట్ల వ్యాపారం
- ప్రజల ఆరోగ్యానికి ముప్పు
- కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఖజానాకు గండి
- దృష్టిసారించని సెంట్రల్ ఎక్సైజ్, రాష్ట్ర పన్నుల శాఖ, పోలీస్ అధికారులు



నకిలీ సిగరెట్లను చూపుతున్న జాయింట్ సీపీ ఫకీరప్ప (ఫైల్)

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

నిషేధిత ఈ-సిగరెట్లతోపాటు ప్రముఖ బ్రాండ్‌ల పేరుతో తయారుచేసిన నకిలీ సిగరెట్లు నగరాన్ని ముంచెత్తుతున్నాయి. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో తయారైన నాసిరకం సిగరెట్లతో పాటు ఈ-సిగరెట్లను కొంతమంది గుట్టుగా నగరానికి దిగుమతి చేసుకుని కిరాణా వ్యాపారులు, పాన్‌షాపులకు సరఫరా చేస్తున్నారు. నకిలీ సిగరెట్ల కారణంగా రూ.కోట్లలో ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది.

నగరంలో గుట్కా మాఫియా తరహాలోనే నకిలీ సిగరెట్ల మాఫియా విస్తరిస్తోంది. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తుండడంతో వ్యాపారులు కూడా వీటి విక్రయాలకే మొగ్గుచూపుతున్నారు. కొంతమంది వ్యాపారులు సిండికేట్‌గా మారి పాకిస్తాన్, బంగ్లాదేశ్‌తోపాటు మనదేశంలోని ఈశాన్య రాష్ట్రాల నుంచి రహస్యంగా పారిస్, ఓల్డ్ స్పైస్, గుడ్‌టైమ్స్, మోర్ ఇంటర్నేషనల్ వంటి బ్రాండ్ల సిగరెట్లను దిగుమతి చేసుకుంటున్నారు. ఇవి నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, నాసిరకం పొగాకుతో తయారైనవి. ఈ నకిలీ సిగరెట్లు నగర మార్కెట్‌లో ప్రతి నెలా రూ.80 కోట్ల వరకూ అమ్ముడవుతున్నట్టు సిగరెట్ వ్యాపారంలో ఉంటున్నవారు చెబుతున్నారు. ఐటీసీ సిగరెట్లను సరఫరా చేసే డిస్ట్రిబ్యూటర్లు నగరంలో నలుగురు మాత్రమే ఉన్నారు. వీరంతా కలిసి నెలకు రూ.50 కోట్ల విలువైన సిగరెట్లను చిరు వ్యాపారులకు సరఫరా చేస్తుంటారు. అయితే నకిలీ సిగరెట్ ధర బాగా తక్కువ కావడంతో ఎక్కువమంది ధూమపాన ప్రియులు వాటివైపే మొగ్గుచూపుతున్నారు. ప్రముఖ బ్రాండ్ల సిగరెట్‌ల మాదిరిగానే కనిపించే నకిలీ సిగరెట్లు తక్కువ ధరకే వస్తుండడంతో ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా వాటివైపే మొగ్గుచూపుతున్నారు. ఐటీసీ బ్రాండ్ల కంటే మూడు రెట్లు ఎక్కువ నకిలీ సిగరెట్లు అమ్ముడవుతున్నట్టు ... మిగతా 4వ పేజీలో

మృత్యు శకటం

- ఆటోను ఢీకొన్న లారీ
- ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతి
- రోడ్డునపడ్డ కుటుంబం - 4లో

ఘనంగా పైడిమాంబ తొలేళ్ల ఉత్సవం



ఆర్పీపేటలో పైడిమాంబ తొలేళ్ల ఉత్సవం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఘటాలకు ప్రత్యేక పూజలు చేశారు. - కంచరపాలెం

రైటర్లను మార్చేయండి

- జోన్-2 పరిధిలోని సీఐలకు డీసీపీ ఆదేశాలు
- అవినీతి ఆరోపణలే కారణం

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి):

నగర పోలీస్ కమిషనరేట్ జోన్-2 పరిధిలోని స్టేషన్లలో రైటర్లను మార్చేయాలంటూ డీసీపీ-2 ఎం.సత్తిబాబు ఆదేశాలు జారీచేశారు. ఒకేసారి రైటర్లందరినీ మార్చేయాలంటూ సీఐలను ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. కొంతమంది రైటర్లపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతుండడమే దీనికి కారణమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జోన్-2 పరిధిలో మూడు పోలీస్ సబ్ డివిజన్లు, 11 స్టేషన్లు ఉన్నాయి. వీటిలో ఎక్కువ స్టేషన్ల పరిధిలో పరిశ్రమలు, స్క్రాప్ దుకాణాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నాయి. స్టేషన్‌కు వచ్చే పిటిషన్ ఏదైనా ముందుగా రైటర్‌కి చేరిన తర్వాత సీఐ దృష్టికి తీసుకువెళతారు. సీఐ ఆదేశాలు మేరకు ఎస్ఐ లేదా ఏఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తారు. ఈ ప్రక్రియలో స్టేషన్ రైటర్‌దే కీలకపాత్ర ఉంటుంది. దీని ఆసరాగా తీసుకుని కొంతమంది అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారు. తాము వసూలు చేసిన దాంట్లో సీఐకి, ఎస్ఐలకు వాటాలు ఇస్తున్నారు. దీంతో సీఐలుగా ఎవరు వచ్చినాసరే రైటర్లు మాత్రం మారడం లేదు. దీంతో స్టేషన్లలో వారు చెప్పిందే వేదం అనే పరిస్థితి నెలకొంది. ఇదిలావుండగా గతంలో ఎన్నడూలేనివిధంగా ఒకేసారి అన్ని స్టేషన్ల రైటర్లను మార్చేయాల్సిందేనని ఆదేశాలు జారీచేయడం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. రైటర్ల అవినీతిపై డీసీపీ-2కి చాలామంది ఫిర్యాదులు చేయడంతోనే మార్చేయాలని ఆయన ఆదేశాలు చేశారని చెబుతున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.12
సహరి (బుధ)	4.40

ప్రధానికి ఎన్నికల కోడ్ వర్తించదా?

» ఫిర్యాదు చేసినా ఈసీఐ స్పందించదేమి?

» రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ



విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత దేశ ప్రధానికి ఎన్నికల కోడ్ వర్తించదా?, ఆయనపై అందిన ఫిర్యాదులను ఎన్నికల సంఘం (ఈసీఐ) పట్టించుకోదా?...అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ వ్యాఖ్యానించారు. ఆయన సోమవారం కొన్ని మీడియా సంస్థలతో మాట్లాడుతూ, వారం క్రితం తమిళనాడులో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై తాను ఈసీకి ఈ నెల 22న ఫిర్యాదు పంపగా ఇప్పటి వరకూ దానిపై ఎటువంటి స్పందన లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు మతపరమైన అంశాలపై మాట్లాడకూడదని, అది ఉల్లంఘన కిందికే వస్తుందని శర్మ చెబుతున్నారు. 'హిందువులు నారీశక్తిని, మాతృశక్తిని బలంగా విశ్వసిస్తారని, అటువంటి శక్తిని నాశనం చేయాలని ఇండియా కూటమి పిలుపునిచ్చిందని, దానిని దేవతలను పూజించే తమిళులు ఆమోదిస్తారా?, హిందూత్వాన్ని అవమానిస్తూ ఇండియా కూటమి పదే పదే మాట్లాడుతోందని, దానిని సహిస్తామా?'...అని మోదీ ఆ సభలో ప్రసంగించినట్టు వార్తలు వచ్చాయని శర్మ తెలిపారు. ఆ ప్రసంగాన్ని పేర్కొంటూ తాను ఈసీకి ఫిర్యాదు చేశానన్నారు. తన ప్రశ్నలకు ఎన్నికల సంఘం పబ్లిక్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎస్ఐలకు ప్రత్యేక వసతులతో కూడిన బైక్‌లు



ఎస్ఐలకు ద్విచక్ర వాహనాలను అందజేస్తున్న జోన్-2 డీసీపీ సత్తిబాబు

మద్రిపాలెం, మార్చి 25: పోలీసులు తమ విధులను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు వీలుగా రూపొందించిన ప్రత్యేక దిచక్రవాహనాలను సోమవారం జోన్-2 డీసీపీ మోకా సత్తిబాబు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్ల ఎస్సైలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్స కిట్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ఎల్ఈడీ స్క్రీన్ తదితర ఏర్పాట్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోగల పోలీసుస్టేషన్ల సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం, మార్చి 25: జీవీఎంసీ 86వ వార్డు పరిధి యాతపాలెం రహదారిలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందినట్టు దువ్వాడ పోలీసులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస సమీపంలోని గోపాలపురానికి చెందిన పైలా భాస్కరరావు (51) బతుకుతెరువు కోసం కుటుంబంతో వచ్చి మల్కాపురం నివాసం ఉంటూ ఎల్అండ్‌టీ కంపెనీలోకార్మికునిగా పని చేస్తున్నాడు. యాతపాలెంలోని బంధువుల ఇంటికి భాస్కరరావు తన స్నేహితునితో కలసి సోమవారం రాత్రి వచ్చాడు. తిరిగి భాస్కరరావు మల్కాపురం బయలుదేరాడు.ఇంతలో రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. భాస్కరరావు మద్యం సేవించి పడిపోయిమృతి చెందాడా లేక ఏదైనా వాహనం ఢీకొందా... అన్నది తేలాల్సి ఉంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విశాఖ 'పశ్చిమ'లో సీపీఐ పోటీ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీకి సీపీఐ దిగాలని నిర్ణయించినట్టు ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. సీపీఐ జిల్లా సమితి కార్యవర్గసభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిని పోటీకి దింపుతామన్నారు. దీంతోపాటు విశాఖ పార్లమెంట్‌కు కూడా పోటీ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యుడు సత్యాంజనేయ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గాడితప్పిన పాలన

ఓటర్ల ప్రలోభాలకు వైసీపీ యత్నం

టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్



ఎంపీ అభ్యర్థిగా శ్రీభరత్‌కు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ, జనసేన నాయకులు

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం పెరిగిపోయిందని టీడీపీ విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం. శ్రీభరత్ ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విశాఖ తూర్పు నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పూర్తిగా పాలన గాడి తప్పిందని అన్నారు. రాష్ట్రంలోపాలన తీరు చూసి పొరుగునున్న రాష్ట్రాలు నవ్వుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. ఒక ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని, ఈవిషయంలో టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చంద్రబాబును అక్రమంగా జైలులో పెడితే పవన్ కల్యాణ్‌ను విమానంలో రాకుండా అడ్డుకున్నారన్నారు. అయినా, ఆయన భయపడకుండా రోడ్డుపై పడుకుని నిరసన తెలిపి నిజమైన హీరో అనిపించుకున్నారన్నారు. వైసీపీ అరాచకాలపై ప్రతి టీడీపీ కార్యకర్తా.. ఇలాగే హీరోలా వ్యవహరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజ యానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుతున్న దుష్ట పాలన పోవడానికి యుద్ధం చేస్తున్నామన్నారు. ఓటర్ల నమోదుపై శ్రద్ధ వహించాలని కోరారు. బీఎల్‌వోలతోపాటు ఉమ్మడి నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి దరఖాస్తుచేసుకున్న వ్యక్తులు ఉన్నారా లేరా అనేది నిర్ధారించుకోవాలన్నారు. ప్రస్తుతం పెద్ద ఎత్తున దొంగ ఓట్ల నమోదుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీతో కలిసి పోటీకి ఏ పార్టీ కూడా ముందుకురాలేదంటే ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సొంత చెల్లెలు, పినతండ్రి కూతురు కూడా జగన్‌పై వ్యతిరేకతతో ఉన్నా రని వెలగపూడి విమర్శించారు. సమావేశంలో జనసేన నగర అధ్యక్షుడు సీహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమన్నారు.

ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చోడే పట్టాభి, పోతనరెడ్డి, గొల గాని వీరారావు, పొలమరశెట్టిశ్రీనివాస్, ఒమ్మి సన్యాసిరావు, బొట్టా వెంకటరమణ, మంగ వేణి, బుడుమూరు గోవింద్, జనసేన నా యకులు బొలిశెట్టి సత్యనారాయణ, పీతల మూర్తి యాదవ్, నాగలక్ష్మి, బీజేపీ నాయకులు మురళీమోహన్,సన్యాసిరాజు, సుజాత, భారతి తది తరులు హాజరయ్యారు. అనంతరం కడప జిల్లాలో వైసీపీ నేతల దురాగ తాలకు ఆత్మహత్య చేసుకున్న మాధవరావు కుటుంబ సభ్యుల మృతికి సంతాపం ప్రకటించి నివాళులర్పించారు.

వైభవంగా పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం

» ఘటాల ఊరేగింపు » ఆర్పీపేట ఆలయానికి పోటెత్తిన భక్తులు » అమ్మవారికి ప్రత్యేక పూజలు

కంచరపాలెం, మార్చి 25: ఆర్పీపేట గ్రామంలోని పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ సాంప్రదాయం ప్రకారం గ్రామస్థులు, భక్తులు పాత జైలు రోడ్డు గొల్లలపాలెం బంగారమ్మగుడి వద్దకు చేరుకుని అక్కడ అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాలను మోసుకుంటూ ఊరేగింపుగా బయలుదేరారు. జగదాంబ, మనోరమ, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం మీదుగా ఆర్పీపేట అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అమ్మవారి ఘటాన్ని తలపై మోశారు. పూజలు నిర్వహించారు.



గొల్లలపాలెం చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



ఘటాలను మోస్తున్న ఎమ్మెల్యే గణబాబు

ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం భక్తులు ఘటాలతో ఇళ్లకు చేరుకున్నారు.తొలేళ్ల సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరించారు. మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ జరగనున్నది.

బీజేపీలో చేరికలు

సీతమ్మధార, మార్చి 25: ఉత్తర నియోజకవర్గం పరిధి 44వ వార్డులో దుర్గారావు అలియాస్ ఎడీఆర్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు బీజేపీలో చేరారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో విష్ణుకుమార్ రాజు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో సమష్టిగా పార్టీ గెలుపునకు కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, సూర్యప్రకాష్, శ్యామ్, రమేష్, సతీష్, రాఘవా తదితరులు పాల్గొన్నారు.



విష్ణుకుమార్ రాజు సమక్షంలో చేరిన యువత

మృత్యుశకటం

ఆటోను ఢీకొన్న లారీ...ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతి



మొల్లేటి ఉట్టిబాబు (ఫైల్)



ఆటోను ఢీకొన్న లారీ

మద్రిపాలెం, మార్చి 25: రహదారిపై వెళుతున్న ఆటోను వెనుక నుంచి అపరిమిత వేగంతో వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళా ప్రయాణికులకు గాయాలవ్వడంతో వారిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎయిర్‌పోర్ట్ జంక్షన్‌లో సోమవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొల్లేటి ఉట్టిబాబు (37) గోపాలపట్నం సమీపంలోని వెంకటపాలెం నందమూరు నగర్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నారు. భార్య ఆశ కేజీహెచ్‌లో తాత్కాలిక ప్రాతిపదికన చిరుద్యోగం చేస్తుండగా, పదేళ్లు, ఎనిమిదేళ్ల వయస్సు కలిగిన కుమారులిద్దరు ఉన్నారు. ఉట్టిబాబు రాత్రిపూట ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటారు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే ఆటో నడిపేందుకు వెళ్లగా, బాగా జ్వరం రావడంతో భార్య ఆశకు ఫోన్ చేశారు. కేజీహెచ్‌కు వస్తే మాత్ర ఇస్తానని ఆమె చెప్పడంతో ఆటోతో ఉట్టిబాబు అక్కడకు వెళ్లారు. మాత్ర వేసుకుని కేజీహెచ్ వద్ద ఆటోలో నిద్రపోయారు. ఉదయం ఆరు గంటలకు లేచి ఆటో తీసుకుని షీలానగర్ జంక్షన్ మీదుగా వెంకన్నపాలెం బయలుదేరారు. ఆటోలో ఇద్దరు మహిళా ప్రయాణికులను ఎక్కించుకుని షీలానగర్ జంక్షన్ నుంచి ఎన్ఏడీ వైపు వస్తుండగా ఎయిర్‌పోర్ట్ జంక్షన్ వద్దకు వెళ్లేసరికి వెనుక నుంచి లోడుతో వస్తున్న ఏపీ 31 టీఎఫ్ 1315 నంబర్ గల సింహాద్రి టీఎంటీ కంపెనీకి చెందిన లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఉట్టిబాబుతోపాటు ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు రోడ్డుపై పడిపోయారు. ఉట్టిబాబు నడుముమీద నుంచి లారీ ముందుచక్రాలు వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన ఇద్దరు మహిళలను కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఉట్టిబాబు భార్య ఆశ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం: మృతుడు ఉట్టిబాబు భార్య ఆశ

సింహాద్రి టీఎంటీ కంపెనీ లారీ ఢీకొని నా భర్త చనిపోయారు. ఇప్పటివరకూ ఆ కంపెనీ యాజమాన్యం స్పందించలేదు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయాం. కంపెనీ యాజమాన్యం, పోలీసులు న్యాయం చేయాలి. కుటుంబాన్ని ఆదుకోవాలి. లేదంటే నా ఇద్దరు పిల్లలతో ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యం.

లారీల నిలిపివేతతో ట్రాఫిక్ ఇబ్బందులు

జ్ఞానాపురం, మార్చి 25: జ్ఞానాపురంలోని ఎఫ్‌సీఐ గొడౌన్‌కు వచ్చే లారీలను ఇక్కడినుంచి జూబ్లీ పాఠశాల వరకు సోమవారం లారీలను బీఆర్‌టీఎస్ రహదారిలో నిలిపివేయడంలో వాహనరాకపోకలకు ఇబ్బం దులు ఎదురయ్యాయి. లారీలను డ్రైవర్లు నచ్చిన రీతిలో ఆపేయడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇష్టానుసారం లారీలను నిలిపే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఒకటి నుంచి 'పది' పేపర్ల మూల్యాంకనం

1000 మంది టీచర్లకు విధులు

జిల్లాకు రెండు లక్షల జవాబు పత్రాలు

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ఈ నెల 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో జవాబు పత్రాల మూల్యాంకనం వచ్చేనెల ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు జరగనున్నది. జ్ఞానాపురంలోని జూబ్లీ స్కూల్‌లో ఈ ఏడాది మూల్యాంకనానికి ఏర్పాట్లు ఏర్పాట్లు చేశారు. మూల్యాంకనానికి జిల్లాకు సుమారు రెండు లక్షల జవాబు పత్రాలు కేటాయించారు. మూల్యాంకనానికి చీఫ్ ఎగ్జామినర్లు , అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు సుమారు వెయ్యి మంది టీచర్ల సేవలు అవసరమని గుర్తించారు. అయితే మూల్యాంకనానికి సరిపడా టీచర్లు లేకపోవడంతో అనకాపల్లి జిల్లా నుంచి 150 మంది అవసరమని గుర్తించి, ఆ జిల్లా విద్యాశాఖకు లేఖ రాశారు. కాగా గత ఏడాది వరకు ఒక జవాబు పత్రం మూల్యాంకనం చేస్తే రూ.6.50 పారితోషికం ఇచ్చే పాఠశాల విద్యాశాఖ ఈ సంవత్సరం నుంచి పది రూపాయలకు పెంచింది.

ఘనంగా హోలీ

అక్కయ్యపాలెం, మార్చి 25: నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువతీ యువకులు రెయిన్ డ్యాన్స్, ఆర్గానిక్ కలర్స్, భారీ ఎత్తున మ్యూజిక్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు.అక్కయ్యపాలెం,దొండపర్తి, తాటిచెట్లపాలెంలో హోలీ వేడుకలు జరిగాయి.



కేరింతలు కొడుతున్న యువత

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షిక మహోత్సవాలు

మురళీనగర్, మార్చి 25 ; ఉత్తర నియోజకవర్గంలో ప్రముఖ శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో సోమవారం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున అర్చకులు పి. బుచ్చిబాబు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు అమ్మవారికి పాలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు, బీజేపీ రాష్ట ఉపాధ్యక్షులు పెన్మెత్స విష్ణుకుమార్ రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైసీపీ ఇన్‌చార్జి కేకే .రాజు దర్శించుకున్నారు. ఉదయంనుంచి బర్మాక్యాంప్, మాధవధార, కంచరపాలెం, ఊర్వశి జంక్షన్ తదితర ప్రాంతాలనుంచి వచ్చి భక్తులు కలశాలతో క్యూలో వేచి ఉండి నూకాంబి జలాభిషేకం చేశారు. కాగా, ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు ఆలయంలో కొత్త అమావాస్య వార్షిక పండ గ మహోత్సవాలు జరపనున్నట్టు ఆలయ ఈవో నగేశ్ తెలిపారు. గ్రామ పెద్దలు బొగ్గు. శ్రీను, కమిటీ సభ్యులు వేడుకలను ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న విష్ణుకుమార్‌రాజు



కలశాలతో బారులుదీరిన మహిళలు

43వ వార్డు వైసీపీ కార్యాలయం ప్రారంభం

అక్కయ్యపాలెం, మార్చి 25 : గ్రేటర్ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్‌లో సోమవారం పార్టీ కార్యాలయాన్ని ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు ప్రారంభించారు.నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బానాల శ్రీనివాసరావు, నాయకులు శివగణేష్, బులుసు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు జగన్ సర్కార్ తీరని అన్యాయం

» చిరిగిన బనియన్లతో వినూత్న నిరసన

జగదాంబ కూడలి, మార్చి 25: తమను జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లతో ఎంతో దగా చేసిందని ముస్లింలు విమర్శించారు. సోమవారం వన్‌టౌన్ లక్ష్మీటాకీస్ వద్ద జనసేన పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్, ఆ పార్టీ ఉత్తరాంధ్ర కో-కన్వీనర్ సాధిక్ నేతృత్వంలో ముస్లింలు చిరిగిన బనీన్లు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినూత్న నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సాధిక్ మాట్లాడుతూ, జగన్ ఎన్నికల ముందు ముస్లింలకు అండగా ఉంటానని హామీ ఇచ్చి మోసగించారన్నారు. దుల్హన్ పథకం, రంజాన్‌తోఫాలకు అతీగతి లేకుండాపోయిందన్నారు. షాదీ ముబారక్‌కు అనేక షరతులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీ సబ్ ప్లాన్‌ను స క్రమంగా అమలు చేయలేదంలేదన్నారు. మైనారిటీ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపులులేవని విరుచుకుపడ్డారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల రీసర్వే, ఇమామ్‌లకు ఇళ్ల స్థలం, హజ్ హౌస్ నిర్మాణం, నామినేటెడ్ పదవుల్లో ముస్లిలకు రిజర్వేషన్ తదితర హామీలను పూర్తిగా జగన్ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి ముస్లింలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



జనసేన నేత సాధిక్ నేతృత్వంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

అందుబాటులో ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ టికెట్లు

విశాఖపట్నం (స్పోర్ట్స్), మార్చి 25: ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగే ఐపీఎల్ మ్యాచ్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. పేటీఎం ఇన్‌సైడర్ ద్వారా అమ్మకాలు ప్రారంభించిన తొలిరోజు రూ.1000, రూ.1500 ధర గల టికెట్లు అమ్మకం అయిపోయాయి. రెండో రోజు (సోమవారం) రాత్రి వరకు రూ.2000, రూ.2500 రూ.3000 రూ.3500 రూ.5000 ధర టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రారంభ ధర టికెట్లు కొనుగోలుకు ఆసక్తి చూపిన క్రీడాభిమానులు...మిగిలిన ధర టికెట్ల విషయంలో వెనుకాడుతున్నారు. క్రీడాభిమానుల చూపు ధోనీ ఆడుతున్న చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌పై ఉండడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్‌కు ఆశించిన డిమాండ్ రావడం లేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి తొలి షెడ్యూల్‌లో ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్, ఈనెల 31న చెన్నై సూపర్ కింగ్స్‌తో, ఏప్రిల్ 3న కోల్‌కతా నైట్ రైడర్స్ ఆడనున్న సంగతి తెలిసిందే. చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌కు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో టికెట్ల అమ్మకాలలో వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఈనెల 31న చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగే మ్యాచ్ టికెట్ల అమ్మకాలను ఈనెల 27 నుంచి చేపట్టనుండగా...ఏప్రిల్ 3న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగే మ్యాచ్ టికెట్ల అమ్మకాలను పది రోజుల ముందుగానే (ఈనెల 24 నుంచి) ప్రారంభించడం గమనార్హం.

ధోనీ హెయిర్ స్టైల్ చూడాలని...

చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఈనెల 31న జరిగే మ్యాచ్ కోసం ఆసక్తి ఎదురుచూస్తూ ధోనీ జపం చేస్తున్న క్రీడాభిమానుల మధ్య సరికొత్త చర్చ జరుగుతోంది. మ్యాచ్‌లో ధోనీ బ్యా టింగ్, కీపింగ్ కోసం కాకుండా ఇటీవల ధోనీ మార్చిన హెయిర్ స్టైల్‌పై చర్చించుకుంటున్నారు. ధోనీ హెయిర్ స్టైల్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు ప్రేక్షకులు ఉత్సాహం చూపడం గమనించదగ్గ విషయం. దేశంలో అగ్రశ్రేణి హెయిర్ స్టైలిస్టు అలీమ్ హకీమ్ చేసిన హెయిర్ స్టైల్‌ను చూడాలని క్రీడాభిమానులు తహతహలాడుతున్నారు.

సిగరెట్ల మాఫియా

... 3వ పేజీ తరువాయి

వ్యాపారులు చెబుతున్నారు.

చాపకింద నీరులా ఈ-సిగరెట్‌ల విక్రయాలు

మానవాళికి ప్రాణంతకమనే కారణంతో ఎలక్ట్రానిక్ సిగరెట్‌లను కేంద్రం పూర్తిగా నిషేధించింది. వీటిని విక్రయించడం, వినియోగించడం కూడా నేరంగానే పరిగణిస్తున్నారు. ఈ-సిగరెట్‌లను వినియోగించడం వల్ల పెద్దమొత్తంలో పొగ వెలువడుతుంది. అందులో నికోటిన్, టొబాకో రసాయనాలు ఉంటాయి. దీనిని తాగేవారితోపాటు వారు విడిచే పొగను పీల్చే చుట్టుపక్కల వారి ఊపిరితిత్తులు దెబ్బ తింటాయి. అయితే నగరంలో చాలామంది యువత ఈ-సిగరెట్ల వినియోగాన్ని ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. దీంతో వీటికి డిమాండ్ పెరుతోంది. దీనిని ఆసరాగా తీసుకుని కొంతమంది వ్యాపారులు నిషేధాన్ని పక్కనపెట్టి మరీ ముంబై నుంచి రహస్యంగా ఈ-సిగరెట్‌లను నగరానికి దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని భారీ లాభాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నగరంలో ఈ-సిగరెట్ల వ్యాపారం నెలకు రూ.రెండు కోట్లు వరకూ జరుగుతుందని అంచనా. తాజాగా సిరిపురం కూడలిలోని మీరా కలెక్షన్స్‌తోపాటు దేజావు క్లాత్ షాప్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి రూ.25 లక్షల విలువ చేసే ఈ-సిగరెట్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదుచేశారు. ఇప్పటికైనా పోలీసులు, కేంద్ర కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ శాఖ, రాష్ట్ర పన్నులశాఖ అధికారులు దృష్టిసారిస్తే నకిలీ సిగరెట్‌లతోపాటు ఈ-సిగరెట్ మాఫియాకు అడ్డుకట్టపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

నాడు-నేడుకు సిమెంట్ కొరత

... 3వ పేజీ తరువాయి

పాఠశాలల్లో ఇనుము మిగిలి ఉంది. కాగా పనుల కోసం పాఠశాల కమిటీ ఖాతాలకు రూ.48.01 కోట్లు మాత్రమే (41.82 శాతం) నిధులు విడుదల చేయగా రూ.41.41 కోట్లు (36.07 శాతం) ఖర్చు చేశారు. ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతుల కల్పనకు రూ.7.98 కోట్లతో పనులు ప్రతిపాదించగా, రూ.2.47 కోట్ల విలువైన సిమెంట్, ఇనుము, ఇసుక సరఫరా చేశారు. కళాశాల కమిటీలకు 3.67 కోట్లు విడుదల చేయగా రూ.3.43 కోట్లు ఖర్చు చేశారు. రూ.1.83 కోట్లు మిగులు ఉన్నాయి.

రహదారి పనుల్లో నాణ్యతాలోపం

... 3వ పేజీ తరువాయి

కాలువలు నిర్మించి, ఆ తరువాత రహదారిని విస్తరించి, ఆపై ఫుట్‌పాత్ పనులు చేపట్టాల్సి ఉంది. దశల వారీగా ఈ పనులు జరుగుతున్నాయి. అయితే కాలువల నిర్మాణంలో ఇనుప చువ్వల (ఐరన్ రాడ్స్)ను ఉపయోగించడం లేదు. అటు, ఇటు చెక్కలు వేసి, మధ్యలో కాంక్రీట్ పోస్తున్నారు. లోతైన కాలువల నిర్మాణం, వాటిపై ఫుట్‌పాత్‌లు కూడా నిర్మించాల్సి ఉన్నందున తప్పనిసరిగా ఐరన్ రాడ్స్ వాడాలని, కానీ ఇక్కడ అలా చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాంట్రాక్టర్లు చేస్తున్న పనులను ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించడం లేదని విమర్శిస్తున్నారు. ఇలాంటి నాసిరకం పనుల వల్ల కాలువలు గోడలు కూలిపోయి, అందులో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతుందని, పైన ఫుట్‌పాత్‌ల నిర్మాణం వల్ల ఆ పూడిక తీయడం కూడా కష్టం అవుతుందని చెబుతున్నారు. పేరుకు రహదారిని విస్తరించినా మురుగునీటి పారుదల సమస్య అధికం అవుతుందని, తక్షణమే ఈ లోపాల్ని సవరించాలని, నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సర్కారు ప్రచార వ్యామోహం.. ప్రజాధనం వృథా

»మూలకు చేరిన వివిధ పథకాల ప్రచార కరపత్రాలు» సచివాలయాలు, జోనల్ కార్యాలయాల్లో గుట్టలుగా బుక్‌లెట్‌లు



జ్ఞానాపురం జోన్ కార్యాలయంలో మిగిలిన కరపత్రాలు, పోస్టర్లు



సచివాలయంలో మూలన పడివేసిన బుక్‌లెట్‌లు

జ్ఞానాపురం, మార్చి 25: వైసీపీ సర్కారు ప్రచార ఆర్భాటాలకు రూ. కోట్లలో ప్రజాధనాన్ని మంచి నీళ్లలా ఖర్చు చేస్తోంది. జగనన్న నమ్మకం, గడపగడపకు మన ప్రభుత్వం, ఆడుదాం ఆంధ్రా ఇలా వివిధ పథకాలను అమలు చేస్తోంది. వీటి వల్ల ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో తెలియదుకాని, ఇందుకు సంబంధించి ప్రచారం కోసం ఖరీదైన బుక్‌లెట్‌లు, కరపత్రాలు పరిమితికి మించి ముద్రించారు. అవి ఇప్పుడు జోనల్ కార్యాలయాలు, సచివాలయాల్లో కుప్పలుతెప్పలుగా పడిఉన్నాయి. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే వీటిని వినియోగించే వీలుంటుంది. లేకుంటే, ఇన్ని లక్షల రూపాయలతో ముద్రించిన కరపత్రాలు, బుక్‌లెట్‌లు చెత్తపాలుకానున్నాయి. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలోనే వందకు పైగా బాక్సుల్లో కరపత్రాలు మిగిలిపోయాయి. ఈ జోన్ పరిధిలో ఉన్న 120 సచివాలయాలకు అవసరానికి సిద్ధం చేసిన బుక్‌లెట్లు, కరప త్రాలు ముద్రించాల్సి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు . ఆడుదాం ఆంధ్రా అంటూ బలవంతంగా క్రీడా పోటీలునిర్వహించిన ప్రభుత్వం లెక్కకు మించి వీటికి సంబంధించి టోపీలు, టీషర్టులు ముద్రించింది. ఇవన్నీ వృథాగా పడి ఉన్నాయి. ప్రజాధనాన్ని అధికారులు ఎలా దుర్వినియోగం చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు.



వివిధ పుష్పాల నడుమ అయ్యప్ప స్వామి

అయ్యప్ప స్వామికి జన్మదిన పూజలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 25: స్టీల్‌ప్లాంట్ అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామివారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అష్టద్రవ్య గణపతి హోమం, నవఫలాభిషేకం, పుష్పార్చన చేశాక హారతి, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

షీలానగర్ ఆలయంలో..

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు వైద్యనాథన్ ఆధ్వర్యంలో స్వామివారిని పంచామృతాలతో అభిషేకించాక ప్రత్యేక పువ్వులు, నగలతో అలంకరించి పూజలు చేశారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వాహకులు ఆలయంలో కేకు కట్ చేశారు. భక్తులకు అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఎస్ఏ నాయుడు, పీవీ శేషగిరిరావు, సీహెచ్ నాగార్జున, నంబారు రాజు, ఎస్.విశ్వేశ్వరరావు, భద్రాచలం, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ కోటి దీపాల జాతర

అగనంపూడి, మార్చి 25: పెదమడక, ఉక్కు నిర్వాసిత గ్రామాల ఆరాధ్య దేవత పైడిమాంబ అమ్మవారి కోటి దీపాల జాతరను సోమవారం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి చెంత దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. తొలేళ్ల ఉత్సవంలో భాగంగా అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించారు. మంగళవారం అమ్మవారి అనుపోత్సవాన్ని నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

నేడు చింతాలమ్మ పండుగ

జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ లేమర్తి గ్రామదేవత చింతాలమ్మ అమ్మవారి పండుగను మంగళవారం నిర్వహించేందుకు భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచే అమ్మవారికి పూజాది కార్యక్రమాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ఏదూరివానిపాలెం పైడిమాంబ అనుపోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

శివాలయంలో పౌర్ణమి పూజలు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 25: స్టీల్‌ప్లాంట్‌లోని పురాతన శివాలయంలో హోలీ పౌర్ణమి పూజలు, 57వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతిష్ఠాపకుల చిత్రపటాన్ని కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ శ్రీసర్వతవర్ధిని సమేతరామలింగేశ్వరుడికి నిత్యం పూజాది కైంకర్యాలు, ప్రతినెలా మాస శివరాత్రి రుద్రాభిషేకాలు, పూజలు చేస్తున్నామన్నారు. ప్రతినిధులు బద్రు నాయక్, యేల్లేటి శ్రీనివాసరావు, ధర్మాల కనకరెడ్డి, చీకటి శ్రీనివాస్, శివరామకృష్ణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసం

సింధియా, మార్చి 25: పారిశ్రామిక ప్రాంతం జైఆంధ్రా కాలనీకి చెందిన బి. తరుణ్ కుమార్ అనే యువకుడు ఫ్లిప్‌కార్టు ద్వారా ఆన్‌లైన్ లో రూ. 1500 విలువగల ఓ ప్రోజెక్టర్ ఆర్డర్ చేశాడు. అయితే, వచ్చిన డెలివరీ బాక్స్ విప్పి చూడగా అందులో బట్టలు ఉతికే సర్ఫ్ ప్యాకెట్, ప్లాస్టిక్ డబ్బా ఉండడడంతో అవాక్కయ్యాడు. జరిగిన మోసంపై పోలీసులను ఆశ్రయించాడు.

సినిమా గైడ్

- **ఓం భీం బుష్:** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **భీమా:** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
- **లైన్ మ్యాన్:** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
- **యమధీర:** మౌర్య (గోపాలపట్నం)
- **గామి:** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
- **ప్రేమలు:** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 28, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 18, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళదుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 144, బరబాటి 20, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 144, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 70, కీరదోస 24, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 46, చిలగడదుంపలు 30 , కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ IIIలో..

సమస్యల వలయంలో స్టీల్‌ప్లాంట్



భవిష్యత్తుపై ఆందోళనలో ఉద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 25: స్టీల్‌ప్లాంట్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. ఉక్కు కర్మాగారాన్ని సమస్యలు చుట్టుముట్టడంతో ప్లాంట్ భవిష్యత్తుపై కార్మిక వర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తుంది. ఒకపక్క ప్లాంట్ సమస్యలు, మరోపక్క ఉద్యోగుల ఇబ్బందులతో అసలు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీంతో కర్మాగారంలో ఏ ఇద్దరు కలిసినా ప్లాంట్ భవిష్యత్తుపైనే చర్చించుకుంటుండడంతో పరిస్థితి ఏ విధంగా మారిందో అవగతమవుతుంది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి కావాల్సిన రా మెటీరియల్ సరిగ్గా రాకపోవడం, ఇనుప ఖనిజం నిల్వ లేకపోవడం వంటి కారణాలతో కర్మాగారంలో పూర్తి స్థాయి ఉత్పత్తి జరగడం లేదు. దీనికితోడు ప్రస్తుతం విద్యుత్ బిల్లు సమస్య ప్లాంట్‌పై మెడమీద కత్తిలా వేలాడుతోంది.. ఐరన్ ఓర్ పూర్తి స్థాయిలో వస్తేనే ఉత్పత్తి పూర్తి స్థాయిలో జరుగుతుంది. ఈ మధ్య కాలంలో విద్యుత్ సమస్య ఎక్కువైపోయింది. బొగ్గు సరిపడేలా ఉంటే ప్లాంట్ ఉత్పత్తికి కావాల్సిన విద్యుత్‌ను వినియోగించుకుని మిగులు విద్యుత్‌ను అమ్ముకునే పరిస్థితి ఉంది. కానీ అందుకు తగ్గ వనరులు ప్లాంట్‌లో కలిపించడం లేదు. ఇదిలా వుండగా ఇంకో పక్క తమ సమస్యలను పరిష్కరించాలంటూ అధికారులు, ఉద్యోగులు, కార్మికులు.. ఇలా అందరూ ఆందోళన బాట పట్టారు. ముఖ్యంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపివేయాలంటూ 1,137 రోజులుగా ఉద్యమాలు చేస్తున్నారు. ప్రైవేటీకరణ భూతం ప్లాంట్‌కు పెను శాపంగా మారింది. వీటన్నింటి నేపథ్యంలో ఉద్యోగులు, కార్మికులు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. స్టీల్‌ప్లాంట్‌కు పూర్తి స్థాయిలో ఐరన్ ఓర్ ఇస్తే కర్మాగారానికి పూర్వ వైభవం వస్తుందని కార్మిక వర్గం ఆశాభావం వ్యక్తం చేస్తుంది.

ప్లాంట్‌కు సహకారం ముఖ్యం



ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం రావాలంటే ప్లాంట్‌కు అన్ని విధాల సహకారం అవసరం. వనరులు సమకూర్చితే అధిక ఉత్పత్తి సాధ్యపడుతుంది. తద్వారా ప్లాంట్ లాభాలు సాధిస్తుంది. సొంత గనులు లేకపోయినప్పటికీ దేశంలో ఇతర ప్రభుత్వ రంగ సంస్థలతో పోటీ పడుతూ స్టీల్‌ప్లాంట్ నాణ్యమైన ఉక్కును ఉత్పత్తి చేస్తుంది. ముందుగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రకటనను కేంద్రం విరమించుకోవాలి.

-ఆర్.సింహాచలం, ఉక్కు ఉద్యోగి

యువత భవిష్యత్తును చిదిమేస్తున్న డ్రగ్స్ మాఫియా

టీడీపీ జిల్లా అధ్యక్షుడు, 'గాజువాక' ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు



గాజువాకలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు

గాజువాక, మార్చి 25: యువత భవిష్యత్తును జగన్ డ్రగ్ మాఫియా చిదిమేస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, గాజువాక నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. టీఎస్ఎన్ఎఫ్ ఆధ్వర్యంలో గాజువాకలోని పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నపూర్ణాంధ్రప్రదేశ్‌గా ఉన్న రాష్ట్రాన్ని సీఎం జగన్ డ్రగాంధ్రప్రదేశ్‌గా మార్చారని మండిపడ్డారు. ఓటర్లకు మత్తు పదార్థాలు ఇచ్చి ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతల హస్తంతోనే డ్రగ్స్ విశాఖ చేరుకుందన్నారు. గంజాయి వినియోగంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండడానికి కారణం వైసీపీ ప్రభుత్వమేనని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలు ఇవన్నీ చూసి మళ్లీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రమాదమని భావిస్తున్నారన్నారు. రాష్ట్రం ప్రగతి సాధించాలన్నా, యువత భవిష్యత్తు బాగుండాలన్నా టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అనంతరం డ్రగ్స్‌కు సంబంధించి ఏపీ నంబర్‌వన్ స్థానంలో ఉందన్న పోస్టర్లను పల్లా, తదితరులు ఆవిష్కరించారు. సమావేశంలో టీఎస్ఎన్ఎఫ్ అధ్యక్షుడు రతన్‌కాంత్, నాయకులు మొల్లి పెంటిరాజు, బొండా రవికుమార్, దశేంద్ర, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి కృషి

కూర్మన్నపాలెం: ముస్లింల సంక్షేమానికి, యువతకు ఉపాధి కల్పనకు టీడీపీ కట్టుబడి ఉందని 'గాజువాక' ఉమ్మడి అభ్యర్థి పల్లా శ్రీనువాసరావు అన్నారు. వడ్లపూడి ముస్లిం వీధిలోని మసీదులో సోమవారం రాత్రి ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. మైనారిటీ కార్పొరేషన్ ద్వారా ముస్లింల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బొండా జగన్, టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, కె.శ్రీనివాసవర్మ, రమణమూర్తి, జిమ్స్‌జగన్, ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని నాశనం చేస్తున్న జగన్

ఉక్కుటౌన్‌షిప్: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడుల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా ఉన్న రాష్ట్రాన్ని వైసీపీ సర్కారు డ్రగ్స్ రవాణాలో ప్రథమ స్థానంలో నిలిపిందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో నాయకులు నమ్మి సింహాద్రి, కొల్లి నాగేశ్వరరావు, రఘుప్రసాద్, చిన్నారావు, సీహెచ్ శ్రీనివాస్, నరేంద్ర, కిరణ్ పాల్గొన్నారు.

'పల్లా'ను కలిసిన టీడీపీ నాయకులు

అగనంపూడి: గాజువాక నియోజక వర్గం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న పల్లా శ్రీనివాసరావును 79, 85 వార్డులకు చెందిన పలువురు టీడీపీ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళతామన్నారు. పల్లాను కలిసి వారిలో నాయకులు కర్రి దశేంద్ర, మచ్చా శివకుమార్, కరణం అప్పారావు, బి.సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

టీడీపీకి ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో ప్రచారం

పెదగంట్యాడ: ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారంతా తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తారని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోము నాయుడు అన్నారు. టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ మండల ఎస్సీ సెల్ నాయకులు దుర్గవానిపాలెంలో ప్రచారం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి ఎస్సీ, ఎస్టీలు టీడీపీతోనే ఉంటున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు పెదపూడి అప్పలస్వామి, జి.పోలయ్య, టి.అప్పారావు, జి.కోటేశ్వరి, పి.సరోజని, కె.సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.



నందమూరినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్



బొత్స ఝాన్సీ, ఆనంద్ కుమార్‌లను గజమాలతో స్వాగతిస్తున్న అభిమానులు

వైసీపీ పాలనలో అన్ని వర్గాలకూ మేలు

వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం, మార్చి 25: వైసీపీ ప్రభుత్వం హయాంలో రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరినట్టు వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. నగర పరిధి 92వ వార్డు వెంకటాపురం పరిసర ప్రాంతాల్లో ఆనంద్ కుమార్, వైసీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్ కుమార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. వార్డు పరిధిలోని నందమూరినగర్, పైడిమాంబకాలనీ, జనతాకాలనీ, పద్మనాభగర్ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా తిరిగి ప్రచారం చేశారు. ప్రజలతో మమేకయ్యారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా బాస్కరరావు, వార్డు వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోలీ సందడే.. సందడి

మల్కాపురం, మార్చి 25: గ్రేటర్ 58వ వార్డు అన్నపూర్ణనగర్‌లో ఉత్తరాదికి చెందిన వారు ఆధ్వర్యంలో నిర్వహించిన హోలీ వేడుకల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా నార్త్ ఇండియన్స్‌తో రంగులుపూసుకుని ఆనందంగా గడిపారు. వారికి హోలీ శుభాకాంక్షలు తెలిపారు. పండగలో తనను భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు, టీడీపీ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లో హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి వీధుల్లో చిన్నారులు, యువకులు రంగులు పూసుకున్నారు. ఎల్లపువానిపాలెం, సంతోష్‌నగర్ ప్రాంతాల్లోని నివసిస్తున్న ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఉద్యోగుల కుటుంబీకులు ఉత్సాహంగా గడిపారు.



ఉత్తరాది వాసుల హోలీ వేడుకల్లో ఎమ్మెల్యే గణబాబు



అక్కిరెడ్డిపాలెంలో రంగులు పూసుకుంటున్న చిన్నారులు

యారాడ బీచ్‌లో యువత కేరింత

సింధియా: యారాడ బీచ్ జనాలతో నిండిపోయింది. యువతీ యువకులు ఒకరిపైఒకరు రంగులు చల్లుకుంటూ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు. సహజ సిద్ధమైన రంగులను చిన్న పిల్లలు, వృద్ధుల వరకు పోటీపడి జల్లుకున్నారు. ఎక్కడికక్కడ పోలీసులు, స్విమ్మర్లు అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68, 69 వార్డులలో హోలీ వేడుకల్లో చిన్నారులు, యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యా సంస్థలకు సెలవు కావడంతో ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. బీహెచ్‌పీవీ క్రీడా మైదానంలో యువత రంగులతో సందడి చేశారు. షీలానగర్, అక్కిరెడ్డిపాలెం, హరిజన జగ్గయ్యపాలెం, మింది కాలనీల్లో పలువురిపై రంగులు చల్లుతూ ఆనందంగా గడిపారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో ఆళ్వార్ పాలిటెక్నిక్ విద్యార్థులు ఎంపిక

వేపగుంట మార్చి 25: గోపాలపట్నం ఆర్.ఆర్.వి. పురం దరి ఉన్న ఆళ్వార్ దాస్ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇక్కడ ఈఈఈ ఫైనల్ ఇయర్ విద్యార్థుల్లో ఆరుగు యుపీఎస్ బ్యాటరీస్, ఇన్వర్టెర్స్ తయారీ సంస్థ, న్యూమ్యాక్స్ ఎనర్జిస్ సొల్యూషన్‌లలో ఉద్యోగాలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ యు.గోపి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన ఎమ్. ధావన్, జే.హేమంత్, ఆర్.హేమంత్, శ్రీ హర్ష, ఎస్.బాలజీ, యు దివ్యశ్రీ, విద్యార్థులు జూన్ 3 నుంచి హైదరాబాద్‌లో నెలరోజుల శిక్షణ అనంతరం జూలైలో విశాఖ కార్యాలయంలో హాజరయ్యేలా ఏర్పాట్లు చేసినట్టు హ్యూమన్ రిసోర్స్ మెనేజర్ యోగేష్ కుమార్ తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులను ఆళ్వార్‌దాస్ గ్రూపు సెక్రటరీ డాక్టర్ రాజేంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాహుల్ ఆళ్వార్‌దాస్, గోపాలపట్నం క్యాంపస్ కో ఆర్డినేటర్ జి.వి.ఎ.ఎస్.భగవాన్ తదితరులు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తులసీ కృష్ణకుమార్ హెచ్.ఓ.డి ఎస్.మానస, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

టీడీపీ సీనియర్ నాయకుని మృతికి సంతాపం

ఎన్.ఎ.డీ జంక్షన్ మార్చి 25: టీడీపీ సీనియర్ నాయకుడు, క్రమశిక్షణ సంఘ సభ్యులు, నాయీ బ్రాహ్మణ సంఘం అభివృద్ధికి కృషి చేసిన గంటుపల్లి నాగేశ్వరరావు మృతికి విశాఖ నగర నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు తీవ్ర సంతాపం తెలిపారు. ఎన్.ఎ.డి. వద్ద ఉన్న సంఘం ప్రధాన కార్యాలయంలో సోమవారం నాగేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను నాయకులు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం విశాఖ జిల్లా అధ్యక్షుడు నరవ పైడిరాజు, గౌరవ అధ్యక్షుడు ఆరిపాక పెంటారావు, విశాఖ పార్లమెంట్ సాధికారిక కమిటీ అధ్యక్షుడు డి.రమేష్; రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లపల్లి అప్పలరాజు, బి.సన్యాసిరావు, వర్మ, అంజిబాబు, రమణాజీ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ చేరిన వారికి కండువాలు వేస్తున్న కరణంరెడ్డి నరసింగరావు

ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం

గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, మార్చి 25: ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ముందుకు సాగుతుందని గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు అన్నారు. గాజువాకలో పలువురు యువత సోమవారం బీజేపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు పార్టీ ఆయన ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రతి పౌరుడు సుఖ సంతోషాలతో ఉండాలన్నదే బీజేపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్రానివిగా ప్రజలను నమ్మిస్తూ వైసీపీ మోసం చేస్తుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ-టీడీపీ-జనసేన కూటమి, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాటా శ్రీనివాస్, బొండా యల్లాజీరావు, బొండా శ్రీదేవి, అశోక్, ఆదిలక్ష్మి, రామకృష్ణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పెదనడుపూరులో వాలీబాల్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో పైడిమాంబ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, తదితరులు

పెదగంట్యాడ, మార్చి 25: పెదనడుపూరు పైడిమాంబ అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని పైడిమాంబ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే జిల్లా స్థాయి ఆహ్వాన వాలీబాల్ పోటీలను ఇక్కడి మైదానంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి చెల్లుబోయిన నాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ పోటీల్లో 12 జట్లు తలపడుతున్నాయన్నారు. విజేతలకు జ్ఞాపికలతో పాటు నగదు బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహక కమిటీ ఛైర్మన్లు మంత్రి శంకర నారాయణ, ఎం.అచ్చంనాయుడు, సభ్యులు బి.భానుకిరణ్, భాస్కరరావు, నాగభూషణరావు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతో హక్కులను పరిరక్షించుకుంటాం

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు మస్తానప్ప

కూర్మన్నపాలెం, మార్చి 25: పోరాటాలతో కార్మిక హక్కులను పరిరక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు వై.మస్తానప్ప అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1,138వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల్లో ఐక్యతను చెడగొట్టాలని చూస్తున్న పలు రాజకీయ పార్టీల నాయకులకు తగిన బుద్ధి చెబుతామన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ముంచేలా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని మండిపడ్డారు. కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రం వెనక్కి తీసుకునేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత కేంద్రానికే దక్కుతుందన్నారు.

తాబేళ్ల సంతాన అభివృద్ధికి చర్యలు: కమిషనర్

వెంకోజీపాలెం, మార్చి 25: నగరంలోని అన్ని బీచ్‌లలోనూ ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంతానోత్పత్తికి సంరక్షణ చర్యలు చేపడుతున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బీచ్‌లలో ఎకో వైజాగ్ కార్యక్రమంలో ఎకో బ్లూ ద్వారా బీచ్‌లలో మెకానికల్ బీచ్ క్లీనింగ్ యంత్రాలతో పరిశుభ్రత పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆలివ్ రిడ్లే తాబేళ్లు తీర ప్రాంతాల్లో ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో వలస వచ్చి గుడ్లు పెట్టి, వాటి సంతానాన్ని వృద్ధి చేసుకుని మళ్లీ మే నెలలో వాటి పిల్లలతో సముద్రంలోకి చేరుకుంటాయని తెలిపారు. ఈమేరకు తాబేళ్ల సంరక్షణకు ఆర్కే బీచ్, సాగర్‌నగర్, చేపల ఉప్పాడ, పెద నాగమయ్యపాలెం తీర ప్రాంతాల్లో మెకానికల్ బీచ్ క్లీనింగ్‌కు బదులు మే నెలాఖరుకు వరకు మాన్యువల్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులతో పరిశుభ్రతా పనులు చేపడతామని చెప్పారు. సందర్శకులు వ్యర్థాలను బీచ్‌లలోని డస్ట్ బిన్లలో వేయాలని కోరారు.

మహాలక్ష్మికి పూజలు, అభిషేకాలు



అలంకరణలో మహాలక్ష్మి

పెందుర్తి, మార్చి 25: పెందుర్తి వెంకటాద్రి శిఖరంపై కొలువైన వెంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మహాలక్ష్మి తిరునక్షత్రం (పుట్టినరోజు) సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మూలవిరాట్టుకు నక్షత్రహారతులిచ్చి అర్చనలు చేశారు. అష్టోత్తర శతనామావళి కనకధారాస్తోత్రాన్ని పఠించారు. అనంతరం మహాలక్ష్మిని ప్రత్యేక అలంకరించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీసూక్త హవనం సుదర్శనహోమంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పాల్గొన్నారు. మహిళలకు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు.

టీడీపీ కార్పొరేటర్‌కు ఎమ్మెల్యే పరామర్శ

పెందుర్తి, మార్చి 25: గ్రేటర్ 94వ వార్డు టీడీపీ కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావును సోమవారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పరామర్శించారు. హృద్రోగ సమస్యతో అస్వస్థకు గురై నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఆయనను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట కోడిగుడ్ల దేవిసాంబ, గండి రవికుమార్ తదితరులు ఉన్నారు.

వైసీపీకి 'గుంటూరు' రాజీనామా

పెందుర్తి, మార్చి 25: సీనియర్ రాజకీయ నేత పెందుర్తి ప్రాంతానికి చెందిన గుంటూరు వెంకట నరసింహంహరావు (జీవీఎన్) వైసీపీకి రాజీనామా చేశారు. పార్టీ వలసవాదులను ప్రోత్సహిస్తుండడంతో తాను రాజీనామా చేసినట్టు చెప్పారు. మూడు దశాబ్దాలుగా గుంటూరు కాంగ్రెస్‌లో డీసీసీ అధ్యక్షునిగా పనిచేశారు. అప్పటి రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణతో ఉన్న సాన్నిహిత్యంతో విశాఖ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. అనంతరం ఆయన ప్రజారాజ్యం, జనసేన పార్టీల్లోకి చేరి పెందుర్తి టిక్కెట్టు ఆశించి భంగపడ్డారు. ఈ నేపథ్యంలో నరసింహారావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వలస వచ్చిన నేతలు ప్రజాప్రతినిధులుగా ఎన్నికవడంతో ఈ ప్రాంతం వెనుకబాటుకు గురవుతుందన్నారు. ఈస్థితిలో పెందుర్తి నియోజవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయనున్నానని తెలిపారు,

చలివేంద్రం ప్రారంభం

సింధియా, మార్చి 25: జీవీఎంసీ 63వ పరిధి జై ఆంధ్రా కాలనీ బస్టాప్ సమీపంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్ సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈచలివేంద్రాన్ని ప్రయాణికులు, స్థానికులు ఉపయోగించుకోవాలని కోరారు. నవరత్న, సునీల్, రవి, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరిని రక్షించిన లైఫ్‌గార్డులు

బీచ్ రోడ్డు, మార్చి 25: ఆర్కే బీచ్‌లో సముద్ర స్నానాలకు దిగి ప్రమాదానికి గురైన ఇద్దరు విద్యార్థులను లైఫ్‌గార్డులు రక్షించారు. హరిగోపాల్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హోలీ కావడంతో సోమవారం ఉదయం పాండురంగాపురం డౌన్ బీచ్‌కు వచ్చారు. ఒడ్డున కాసేపు రంగులు పూసుకుని స్నానానికి సముద్రంలోకి దిగారు. అలల తాకిడి పెరగడంతో కౌశిక్, బషీర్ సముద్రంలోకి కొట్టుకుపోయారు. దీన్ని గమనించిన లైఫ్‌గార్డులు జె. హరీష్, ఎం. నవీన్, బి. అరవింద్, పి. అచ్చన్న, ఎం. కిషోర్ సముద్రంలోకి వెళ్లి ముందుగా ఒడ్డుకు దగ్గరగా ఉన్న కౌశిక్‌ను బయటకు తీసుకువచ్చారు. తరువాత అలల్లో కొట్టుకుపోతున్న బషీర్‌ను ఒడ్డుకు తీసుకువచ్చారు. ఇద్దరూ నీళ్లు ఎక్కువగా తాగడంతో అక్కడే సీపీఆర్ చేసి కేజీహెచ్‌కు తరలించారు. విద్యార్థులను రక్షించిన లైఫ్‌గార్డులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, త్రీ టౌన్ సీఐ పార్థసారథి, తదితరులు అభినందించారు.

ప్రధానికి ఎన్నికల కోడ్ వర్తించదా?

» ఫిర్యాదు చేసినా ఈసీఐ స్పందించదేమి?

» రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ



విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): భారత దేశ ప్రధానికి ఎన్నికల కోడ్ వర్తించదా?, ఆయనపై అందిన ఫిర్యాదులను ఎన్నికల సంఘం (ఈసీఐ) పట్టించుకోదా?...అంటూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ వ్యాఖ్యానించారు. ఆయన సోమవారం కొన్ని మీడియా సంస్థలతో మాట్లాడుతూ, వారం క్రితం తమిళనాడులో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలపై తాను ఈసీకి ఈ నెల 22న ఫిర్యాదు పంపగా ఇప్పటి వరకూ దానిపై ఎటువంటి స్పందన లేకపోవడం ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు రాజకీయ నాయకులు మతపరమైన అంశాలపై మాట్లాడకూడదని, అది ఉల్లంఘన కిందికే వస్తుందని శర్మ చెబుతున్నారు. 'హిందువులు నారీశక్తిని, మాతృశక్తిని బలంగా విశ్వసిస్తారని, అటువంటి శక్తిని నాశనం చేయాలని ఇండియా కూటమి పిలుపునిచ్చిందని, దానిని దేవతలను పూజించే తమిళులు ఆమోదిస్తారా?, హిందూత్వాన్ని అవమానిస్తూ ఇండియా కూటమి పదే పదే మాట్లాడుతోందని, దానిని సహిస్తామా?'...అని మోదీ ఆ సభలో ప్రసంగించినట్టు వార్తలు వచ్చాయని శర్మ తెలిపారు. ఆ ప్రసంగాన్ని పేర్కొంటూ తాను ఈసీకి ఫిర్యాదు చేశానన్నారు. తన ప్రశ్నలకు ఎన్నికల సంఘం పబ్లిక్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎస్ఐలకు ప్రత్యేక వసతులతో కూడిన బైక్‌లు



ఎస్ఐలకు ద్విచక్ర వాహనాలను అందజేస్తున్న జోన్-2 డీసీపీ సత్తిబాబు

మద్రిపాలెం, మార్చి 25: పోలీసులు తమ విధులను మరింత మెరుగ్గా నిర్వహించేందుకు వీలుగా రూపొందించిన ప్రత్యేక దిచక్రవాహనాలను సోమవారం జోన్-2 డీసీపీ మోకా సత్తిబాబు వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు స్టేషన్ల ఎస్సైలకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రథమ చికిత్స కిట్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ఎల్ఈడీ స్క్రీన్ తదితర ఏర్పాట్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోగల పోలీసుస్టేషన్ల సీఐలు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడి వ్యక్తి మృతి

కూర్మన్నపాలెం, మార్చి 25: జీవీఎంసీ 86వ వార్డు పరిధి యాతపాలెం రహదారిలో సోమవారం రాత్రి ఓ వ్యక్తి మృతి చెందినట్టు దువ్వాడ పోలీసులు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా పలాస సమీపంలోని గోపాలపురానికి చెందిన పైలా భాస్కరరావు (51) బతుకుతెరువు కోసం కుటుంబంతో వచ్చి మల్కాపురం నివాసం ఉంటూ ఎల్అండ్‌టీ కంపెనీలోకార్మికునిగా పని చేస్తున్నాడు. యాతపాలెంలోని బంధువుల ఇంటికి భాస్కరరావు తన స్నేహితునితో కలసి సోమవారం రాత్రి వచ్చాడు. తిరిగి భాస్కరరావు మల్కాపురం బయలుదేరాడు.ఇంతలో రోడ్డుపై పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. భాస్కరరావు మద్యం సేవించి పడిపోయిమృతి చెందాడా లేక ఏదైనా వాహనం ఢీకొందా... అన్నది తేలాల్సి ఉంది. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విశాఖ 'పశ్చిమ'లో సీపీఐ పోటీ

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రానున్న ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీకి సీపీఐ దిగాలని నిర్ణయించినట్టు ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి తెలిపారు. సీపీఐ జిల్లా సమితి కార్యవర్గసభ్యుడు కసిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో సోమవారం జిల్లా సమితి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గం నుంచి సీపీఐ అభ్యర్థిని పోటీకి దింపుతామన్నారు. దీంతోపాటు విశాఖ పార్లమెంట్‌కు కూడా పోటీ చేసే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యుడు సత్యాంజనేయ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో గాడితప్పిన పాలన

ఓటర్ల ప్రలోభాలకు వైసీపీ యత్నం

టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్



ఎంపీ అభ్యర్థిగా శ్రీభరత్‌కు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ, జనసేన నాయకులు

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అరాచకం పెరిగిపోయిందని టీడీపీ విశాఖ లోక్‌సభ అభ్యర్థి ఎం. శ్రీభరత్ ఆరోపించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన విశాఖ తూర్పు నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో పూర్తిగా పాలన గాడి తప్పిందని అన్నారు. రాష్ట్రంలోపాలన తీరు చూసి పొరుగునున్న రాష్ట్రాలు నవ్వుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. ఒక ఛాన్స్ అంటూ అధికారంలోనికి వచ్చి సర్వనాశనం చేశారని దుయ్యబట్టారు. త్వరలో జరగనున్న ఎన్నికలకు ఇప్పటి నుంచే వైసీపీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని, ఈవిషయంలో టీడీపీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చంద్రబాబును అక్రమంగా జైలులో పెడితే పవన్ కల్యాణ్‌ను విమానంలో రాకుండా అడ్డుకున్నారన్నారు. అయినా, ఆయన భయపడకుండా రోడ్డుపై పడుకుని నిరసన తెలిపి నిజమైన హీరో అనిపించుకున్నారన్నారు. వైసీపీ అరాచకాలపై ప్రతి టీడీపీ కార్యకర్తా.. ఇలాగే హీరోలా వ్యవహరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజ యానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సాగుతున్న దుష్ట పాలన పోవడానికి యుద్ధం చేస్తున్నామన్నారు. ఓటర్ల నమోదుపై శ్రద్ధ వహించాలని కోరారు. బీఎల్‌వోలతోపాటు ఉమ్మడి నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి దరఖాస్తుచేసుకున్న వ్యక్తులు ఉన్నారా లేరా అనేది నిర్ధారించుకోవాలన్నారు. ప్రస్తుతం పెద్ద ఎత్తున దొంగ ఓట్ల నమోదుపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీతో కలిసి పోటీకి ఏ పార్టీ కూడా ముందుకురాలేదంటే ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. సొంత చెల్లెలు, పినతండ్రి కూతురు కూడా జగన్‌పై వ్యతిరేకతతో ఉన్నారని వెలగపూడి విమర్శించారు. సమావేశంలో జనసేన నగర అధ్యక్షుడు సీహెచ్. వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీ ఓటమి ఖాయమన్నారు.

ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చోడే పట్టాభి, పోతనరెడ్డి, గొల గాని వీరారావు, పొలమరశెట్టిశ్రీనివాస్, ఒమ్మి సన్యాసిరావు, బొట్టా వెంకటరమణ, మంగ వేణి, బుడుమూరు గోవింద్, జనసేన నా యకులు బొలిశెట్టి సత్యనారాయణ, పీతల మూర్తి యాదవ్, నాగలక్ష్మి, బీజేపీ నాయకులు మురళీమోహన్,సన్యాసిరాజు, సుజాత, భారతి తది తరులు హాజరయ్యారు. అనంతరం కడప జిల్లాలో వైసీపీ నేతల దురాగ తాలకు ఆత్మహత్య చేసుకున్న మాధవరావు కుటుంబ సభ్యుల మృతికి సంతాపం ప్రకటించి నివాళర్పించారు.

వైభవంగా పైడితల్లమ్మ తొలేళ్ల ఉత్సవం

» ఘటాల ఊరేగింపు » ఆర్పీపేట ఆలయానికి పోటెత్తిన భక్తులు » అమ్మవారికి ప్రత్యేక పూజలు

కంచరపాలెం, మార్చి 25: ఆర్పీపేట గ్రామంలోని పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ సాంప్రదాయం ప్రకారం గ్రామస్తులు, భక్తులు పాత జైలు రోడ్డు గొల్లలపాలెం బంగారమ్మగుడి వద్దకు చేరుకుని అక్కడ అమ్మవారి ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఘటాలను మోసుకుంటూ ఊరేగింపుగా బయలుదేరారు. జగదాంబ, మనోరమ, కాన్వెంట్ కూడలి, జ్ఞానాపురం మీదుగా ఆర్పీపేట అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు అమ్మవారి ఘటాన్ని తలపై మోశారు. పూజలు నిర్వహించారు.

ఆలయం వద్ద ప్రత్యేక పూజల అనంతరం భక్తులు ఘటాలతో ఇళ్లకు చేరుకున్నారు.తొలేళ్ల సందర్భంగా గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరించారు. మంగళవారం అమ్మవారి ప్రధాన పండగ జరగనున్నది.



గొల్లలపాలెం చెట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు



ఘటాలను మోస్తున్న ఎమ్మెల్యే గణబాబు

బీజేపీలో చేరికలు

సీతమ్మధార, మార్చి 25: ఉత్తర నియోజకవర్గం పరిధి 44వ వార్డులో దుర్గారావు అలియాస్ ఎడీఆర్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో యువకులు బీజేపీలో చేరారు. సీతమ్మధారలోని పార్టీ కార్యాలయంలో విష్ణుకుమార్ రాజు వారికి పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో సమష్టిగా పార్టీ గెలుపునకు కృషి చేస్తామని వారు ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో అనిల్, సూర్యప్రకాష్, శ్యామ్, రమేష్, సతీష్, రాఘవా తదితరులు పాల్గొన్నారు.



విష్ణుకుమార్ రాజు సమక్షంలో చేరిన యువత

మృత్యుశకటం

ఆటోను ఢీకొన్న లారీ...ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతి



మొల్లేటి ఉట్టిబాబు (ఫైల్)



ఆటోను ఢీకొన్న లారీ

మద్రిపాలెం, మార్చి 25: రహదారిపై వెళుతున్న ఆటోను వెనుక నుంచి అపరిమిత వేగంతో వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఆటోడ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళా ప్రయాణికులకు గాయాలవ్వడంతో వారిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ఎయిర్‌పోర్ట్ జంక్షన్‌లో సోమవారం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మొల్లేటి ఉట్టిబాబు (37) గోపాలపట్నం సమీపంలోని వెంకటపాలెం నందమూరు నగర్‌లో కుటుంబంతో కలిసి ఉంటున్నారు. భార్య ఆశ కేజీహెచ్‌లో తాత్కాలిక ప్రాతిపదికన చిరుద్యోగం చేస్తుండగా, పదేళ్లు, ఎనిమిదేళ్ల వయస్సు కలిగిన కుమారులిద్దరు ఉన్నారు. ఉట్టిబాబు రాత్రిపూట ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటారు. ఆదివారం రాత్రి ఎప్పటిలాగే ఆటో నడిపేందుకు వెళ్లగా, బాగా జ్వరం రావడంతో భార్య ఆశకు ఫోన్ చేశారు. కేజీహెచ్‌కు వస్తే మాత్ర ఇస్తానని ఆమె చెప్పడంతో ఆటోతో ఉట్టిబాబు అక్కడకు వెళ్లారు. మాత్ర వేసుకుని కేజీహెచ్ వద్ద ఆటోలో నిద్రపోయారు. ఉదయం ఆరు గంటలకు లేచి ఆటో తీసుకుని షీలానగర్ జంక్షన్ మీదుగా వెంకన్నపాలెం బయలుదేరారు. ఆటోలో ఇద్దరు మహిళా ప్రయాణికులను ఎక్కించుకుని షీలానగర్ జంక్షన్ నుంచి ఎన్ఏడీ వైపు వస్తుండగా ఎయిర్‌పోర్ట్ జంక్షన్ వద్దకు వెళ్లేసరికి వెనుక నుంచి లోడుతో వస్తున్న ఏపీ 31 టీఎఫ్ 1315 నంబర్ గల సింహాద్రి టీఎంటీ కంపెనీకి చెందిన లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో ఉట్టిబాబుతోపాటు ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు రోడ్డుపై పడిపోయారు. ఉట్టిబాబు నడుముమీద నుంచి లారీ ముందుచక్రాలు వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గాయపడిన ఇద్దరు మహిళలను కేజీహెచ్‌కు తరలించి చికిత్స అందజేస్తున్నారు. ఉట్టిబాబు భార్య ఆశ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎయిర్‌పోర్ట్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్ మార్చురీకి తరలించారు.

ఆదుకోకుంటే ఆత్మహత్యే శరణ్యం: మృతుడు ఉట్టిబాబు భార్య ఆశ

సింహాద్రి టీఎంటీ కంపెనీ లారీ ఢీకొని నా భర్త చనిపోయారు. ఇప్పటివరకూ ఆ కంపెనీ యాజమాన్యం స్పందించలేదు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయాం. కంపెనీ యాజమాన్యం, పోలీసులు న్యాయం చేయాలి. కుటుంబాన్ని ఆదుకోవాలి. లేదంటే నా ఇద్దరు పిల్లలతో ఆత్మహత్య చేసుకోవడమే శరణ్యం.

లారీల నిలిపివేతతో ట్రాఫిక్ ఇబ్బందులు

జ్ఞానాపురం, మార్చి 25: జ్ఞానాపురంలోని ఎఫ్‌సీఐ గొడౌన్‌కు వచ్చే లారీలను ఇక్కడినుంచి జూబ్లీ పాఠశాల వరకు సోమవారం లారీలను బీఆర్‌టీఎస్ రహదారిలో నిలిపివేయడంలో వాహనరాకపోకలకు ఇబ్బం దులు ఎదురయ్యాయి. లారీలను డ్రైవర్లు నచ్చిన రీతిలో ఆపేయడంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇష్టానుసారం లారీలను నిలిపే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

ఒకటి నుంచి 'పది' పేపర్ల మూల్యాంకనం

1000 మంది టీచర్లకు విధులు

జిల్లాకు రెండు లక్షల జవాబు పత్రాలు

విశాఖపట్నం, మార్చి 25 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ఈ నెల 30వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో జవాబు పత్రాల మూల్యాంకనం వచ్చేనెల ఒకటి నుంచి ఎనిమిదో తేదీ వరకు జరగనున్నది. జ్ఞానాపురంలోని జూబ్లీ స్కూల్‌లో ఈ ఏడాది మూల్యాంకనానికి ఏర్పాట్లు ఏర్పాట్లు చేశారు. మూల్యాంకనానికి జిల్లాకు సుమారు రెండు లక్షల జవాబు పత్రాలు కేటాయించారు. మూల్యాంకనానికి చీఫ్ ఎగ్జామినర్లు , అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు సుమారు వెయ్యి మంది టీచర్ల సేవలు అవసరమని గుర్తించారు. అయితే మూల్యాంకనానికి సరిపడా టీచర్లు లేకపోవడంతో అనకాపల్లి జిల్లా నుంచి 150 మంది అవసరమని గుర్తించి, ఆ జిల్లా విద్యాశాఖకు లేఖ రాశారు. కాగా గత ఏడాది వరకు ఒక జవాబు పత్రం మూల్యాంకనం చేస్తే రూ.6.50 పారితోషికం ఇచ్చే పాఠశాల విద్యాశాఖ ఈ సంవత్సరం నుంచి పది రూపాయలకు పెంచింది.

ఘనంగా హోలీ

అక్కయ్యపాలెం, మార్చి 25: నాలుగు లేన్ల రహదారికి ఆనుకుని ఉన్న పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ స్పోర్ట్స్ క్లబ్‌లో సోమవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువతీ యువకులు రెయిన్ డ్యాన్స్, ఆర్గానిక్ కలర్స్, భారీ ఎత్తున మ్యూజిక్ సిస్టమ్స్ ఏర్పాటు చేశారు.అక్కయ్యపాలెం,దొండపర్తి, తాటిచెట్లపాలెంలో హోలీ వేడుకలు జరిగాయి.



కేరింతలు కొడుతున్న యువత

సిగరెట్ల మాఫియా

... 3వ పేజీ తరువాయి

వ్యాపారులు చెబుతున్నారు.

చాపకింద నీరులా ఈ-సిగరెట్‌ల విక్రయాలు

మానవాళికి ప్రాణంతకమనే కారణంతో ఎలక్ట్రానిక్ సిగరెట్‌లను కేంద్రం పూర్తిగా నిషేధించింది. వీటిని విక్రయించడం, వినియోగించడం కూడా నేరంగానే పరిగణిస్తున్నారు. ఈ-సిగరెట్‌లను వినియోగించడం వల్ల పెద్దమొత్తంలో పొగ వెలువడుతుంది. అందులో నికోటిన్, టొబాకో రసాయనాలు ఉంటాయి. దీనిని తాగేవారితోపాటు వారు విడిచే పొగను పీల్చే చుట్టుపక్కల వారి ఊపిరితిత్తులు దెబ్బతింటాయి. అయితే నగరంలో చాలామంది యువత ఈ-సిగరెట్ల వినియోగాన్ని ఫ్యాషన్‌గా భావిస్తున్నారు. దీంతో వీటికి డిమాండ్ పెరుగుతోంది. దీనిని ఆసరాగా తీసుకుని కొంతమంది వ్యాపారులు నిషేధాన్ని పక్కనపెట్టి మరీ ముంబై నుంచి రహస్యంగా ఈ-సిగరెట్‌లను నగరానికి దిగుమతి చేసుకుంటున్నారు. వాటిని భారీ లాభాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. నగరంలో ఈ-సిగరెట్ల వ్యాపారం నెలకు రూ.రెండు కోట్లు వరకూ జరుగుతుందని అంచనా. తాజాగా సిరిపురం కూడలిలోని మీరా కలెక్షన్స్‌తోపాటు దేజావు క్లాత్ షాప్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి రూ.25 లక్షల విలువ చేసే ఈ-సిగరెట్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదుచేశారు. ఇప్పటికైనా పోలీసులు, కేంద్ర కస్టమ్స్ అండ్ ఎక్సైజ్ శాఖ, రాష్ట్ర పన్నులశాఖ అధికారులు దృష్టిసారిస్తే నకిలీ సిగరెట్‌లతోపాటు ఈ-సిగరెట్ మాఫియాకు అడ్డుకట్టపడుతుందని అభిప్రాయపడుతున్నారు.

నాడు-నేడుకు సిమెంట్ కొరత

... 3వ పేజీ తరువాయి

పాఠశాలల్లో ఇనుము మిగిలి ఉంది. కాగా పనుల కోసం పాఠశాల కమిటీ ఖాతాలకు రూ.48.01 కోట్లు మాత్రమే (41.82 శాతం) నిధులు విడుదల చేయగా రూ.41.41 కోట్లు (36.07 శాతం) ఖర్చు చేశారు. ఎనిమిది ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతుల కల్పనకు రూ.7.98 కోట్లతో పనులు ప్రతిపాదించగా, రూ.2.47 కోట్ల విలువైన సిమెంట్, ఇనుము, ఇసుక సరఫరా చేశారు. కళాశాల కమిటీలకు 3.67 కోట్లు విడుదల చేయగా రూ.3.43 కోట్లు ఖర్చు చేశారు. రూ.1.83 కోట్లు మిగులు ఉన్నాయి.

రహదారి పనుల్లో నాణ్యతాలోపం

... 3వ పేజీ తరువాయి

కాలువలు నిర్మించి, ఆ తరువాత రహదారిని విస్తరించి, ఆపై ఫుట్‌పాత్ పనులు చేపట్టాల్సి ఉంది. దశల వారీగా ఈ పనులు జరుగుతున్నాయి. అయితే కాలువల నిర్మాణంలో ఇనుప చువ్వల (ఐరన్ రాడ్స్)ను ఉపయోగించడం లేదు. అటు, ఇటు చెక్కలు వేసి, మధ్యలో కాంక్రీట్ పోస్తున్నారు. లోతైన కాలువల నిర్మాణం, వాటిపై ఫుట్‌పాత్‌లు కూడా నిర్మించాల్సి ఉన్నందున తప్పనిసరిగా ఐరన్ రాడ్స్ వాడాలని, కానీ ఇక్కడ అలా చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాంట్రాక్టర్లు చేస్తున్న పనులను ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించడం లేదని విమర్శిస్తున్నారు. ఇలాంటి నాసిరకం పనుల వల్ల కాలువలు గోడలు కూలిపోయి, అందులో మురుగు ఎక్కడికక్కడ నిలిచిపోతుందని, పైన ఫుట్‌పాత్‌ల నిర్మాణం వల్ల ఆ పూడిక తీయడం కూడా కష్టం అవుతుందని చెబుతున్నారు. పేరుకు రహదారిని విస్తరించినా మురుగునీటి పారుదల సమస్య అధికం అవుతుందని, తక్షణమే ఈ లోపాల్ని సవరించాలని, నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా నూకాంబిక ఆలయ వార్షిక మహోత్సవాలు

మురళీనగర్, మార్చి 25 ; ఉత్తర నియోజకవర్గంలో ప్రముఖ శ్రీ నూకాంబిక అమ్మవారి ఆలయంలో సోమవారం ఫాల్గుణ శుద్ధ ఏకాదశి సందర్భంగా వార్షిక మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేకువ జామున అర్చకులు పి. బుచ్చిబాబు శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలతో పాటు అమ్మవారికి పాలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. మాజీ శాసనసభ్యులు, బీజేపీ రాష్ట ఉపాధ్యక్షులు పెన్మెత్స విష్ణు కుమార్ రాజు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైసీపీ ఇన్‌చార్జి కేకే .రాజు దర్శించుకున్నారు. ఉదయంనుంచి బర్మాక్యాంప్, మాధవధార, కంచరపాలెం, ఊర్వశి జంక్షన్ తదితర ప్రాంతాలనుంచి వచ్చి భక్తులు కలశాలతో క్యూలో వేచి ఉండి నూకాంబి జలాభిషేకం చేశారు. కాగా, ఈనెల 30వ తేదీ నుంచి ఏప్రిల్ 8వ తేదీ వరకు ఆలయంలో కొత్త అమావాస్య వార్షిక పండ గ మహోత్సవాలు జరపనున్నట్టు ఆలయ ఈవో నగేశ్ తెలిపారు. గ్రామ పెద్దలు బొగ్గు. శ్రీను, కమిటీ సభ్యులు వేడుకలను ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న విష్ణుకుమార్‌రాజు



కలశాలతో బారులుదీరిన మహిళలు

43వ వార్డు వైసీపీ కార్యాలయం ప్రారంభం

అక్కయ్యపాలెం, మార్చి 25 : గ్రేటర్ 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ ఆధ్వర్యంలో శ్రీనివాసనగర్‌లో సోమవారం పార్టీ కార్యాలయాన్ని ఉత్తర నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే రాజు ప్రారంభించారు.నియోజకవర్గ పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బానాల శ్రీనివాసరావు, నాయకులు శివగణేష్, బులుసు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు జగన్ సర్కార్ తీరని అన్యాయం

» చిరిగిన బనియన్లతో వినూత్న నిరసన

జగదాంబ కూడలి, మార్చి 25: తమను జగన్ ప్రభుత్వం గత ఐదేళ్లతో ఎంతో దగా చేసింద ని ముస్లింలు విమర్శించారు. సోమవారం వన్‌టౌన్ లక్ష్మీటాకీస్ వద్ద జనసేన పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్, ఆ పార్టీ ఉత్తరాంధ్ర కో-కన్వీనర్ సాధిక్ నేతృత్వంలో ముస్లింలు చిరిగిన బనీన్లు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వినూత్న నిరసన చేపట్టారు. ఈసందర్భంగా సాధిక్ మాట్లాడుతూ, జగన్ ఎన్నికల ముందు ముస్లింలకు అండగా ఉంటానని హామీ ఇచ్చి మోసగించారన్నారు. దుల్హన్ పథకం, రంజాన్‌తోఫాలకు అతీగతి లేకుండాపోయిందన్నారు. షాదీ ముబారక్‌కు అనేక షరతులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీ సబ్ ప్లాన్‌ను స క్రమంగా అమలు చేయలేడంలేదన్నారు. మైనారిటీ కార్పొరేషన్‌కు నిధుల కేటాయింపులులేవని విరుచుకుపడ్డారు. వక్ఫ్‌బోర్డు ఆస్తుల రీసర్వే, ఇమామ్‌లకు ఇళ్ల స్థలం, హజ్ హౌస్ నిర్మాణం, నామినేటెడ్ పదవుల్లో ముస్లిలకు రిజర్వేషన్ తదితర హామీలను పూర్తిగా జగన్ ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. ఈ స్థితిలో రానున్న ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి ముస్లింలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ముస్లిం నాయకులు పాల్గొన్నారు.



జనసేన నేత సాధిక్ నేతృత్వంలో నిరసన తెలుపుతున్న ముస్లింలు

అందుబాటులో ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ టికెట్లు

విశాఖపట్నం (స్పోర్ట్సు), మార్చి 25: ఏసీఏ వీడీసీఏ స్టేడియంలో ఏప్రిల్ 3న ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మధ్య జరిగే ఐపీఎల్ మ్యాచ్ టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి. పేటీఎం ఇన్‌సైడర్ ద్వారా అమ్మకాలు ప్రారంభించిన తొలిరోజు రూ.1000, రూ.1500 ధర గల టికెట్లు అమ్మకం అయిపోయాయి. రెండో రోజు (సోమవారం) రాత్రి వరకు రూ.2000, రూ.2500 రూ.3000 రూ.3500 రూ.5000 ధర టికెట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రారంభ ధర టికెట్లు కొనుగోలుకు ఆసక్తి చూపిన క్రీడాభిమానులు...మిగిలిన ధర టికెట్ల విషయంలో వెనుకాడుతున్నారు. క్రీడాభిమానుల చూపు ధోనీ ఆడుతున్న చెన్నై సూపర్‌కింగ్స్ మ్యాచ్‌పై ఉండడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్‌కు ఆశించిన డిమాండ్ రావడం లేదని అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఐపీఎల్ మ్యాచ్‌లకు సంబంధించి తొలి షెడ్యూల్‌లో ఏసీఏ వీడీసీఏ స్టేడియాన్ని హోం గ్రౌండ్‌గా చేసుకున్న ఢిల్లీ క్యాపిటల్స్, ఈనెల 31న చెన్నై సూపర్ కింగ్స్‌తో, ఏప్రిల్ 3న కోల్‌కతా నైట్ రైడర్స్ ఆడనున్న సంగతి తెలిసిందే. చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగే మ్యాచ్‌కు డిమాండ్ ఏర్పడిన నేపథ్యంలో టికెట్ల అమ్మకాలలో వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఈనెల 31న చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగే మ్యాచ్ టికెట్ల అమ్మకాలను ఈనెల 27 నుంచి చేపట్టనుండగా...ఏప్రిల్ 3న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగే మ్యాచ్ టికెట్ల అమ్మకాలను పది రోజుల ముందుగానే (ఈనెల 24 నుంచి) ప్రారంభించడం గమనార్హం.

ధోనీ హెయిర్ స్టైల్ చూడాలని...

చెన్నై సూపర్‌కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఈనెల 31న జరిగే మ్యాచ్ కోసం ఆసక్తి ఎదురుచూస్తూ ధోనీ జపం చేస్తున్న క్రీడాభిమానుల మధ్య సరికొత్త చర్చ జరుగుతోంది. మ్యాచ్‌లో ధోనీ బ్యా టింగ్, కీపింగ్ కోసం కాకుండా ఇటీవల ధోనీ మార్చిన హెయిర్ స్టైల్‌పై చర్చించుకుంటున్నారు. ధోనీ హెయిర్ స్టైల్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు ప్రేక్షకులు ఉత్సాహం చూపడం గమనించదగ్గ విషయం. దేశంలో అగ్రశ్రేణి హెయిర్ స్టైలిస్టు ఆలీమ్ హకీమ్ చేసిన హెయిర్ స్టైల్‌ను చూడాలని క్రీడాభిమానులు తహతహలాడుతున్నారు.

సర్కారు ప్రచార వ్యామోహం.. ప్రజాధనం వృథా

» మూలకు చేరిన వివిధ పథకాల ప్రచార కరపత్రాలు » సచివాలయాలు, జోనల్ కార్యాలయాల్లో గుట్టలుగా బుక్‌లెట్‌లు



జ్ఞానాపురం జోన్ కార్యాలయంలో మిగిలిన కరపత్రాలు, పోస్టర్లు



సచివాలయంలో మూలన పడివేసిన బుక్‌లెట్‌లు

జ్ఞానాపురం, మార్చి 25: వైసీపీ సర్కారు ప్రచార ఆర్భాటాలకు రూ. కోట్లలో ప్రజాధనాన్ని మంచి నీళ్లలా ఖర్చు చేస్తోంది. జగనన్న నమ్మకం, గడపగడపకు మన ప్రభుత్వం, ఆడుదాం ఆంధ్రా ఇలా వివిధ పథకాలను అమలు చేస్తోంది. వీటి వల్ల ఏ మేరకు ప్రయోజనం చేకూరిందో తెలియదుకాని, ఇందుకు సంబంధించి ప్రచారం కోసం ఖరీదైన బుక్‌లెట్‌లు, కరపత్రాలు పరిమితికి మించి ముద్రించారు. అవి ఇప్పుడు జోనల్ కార్యాలయాలు, సచివాలయాల్లో కుప్పలుతెప్పలుగా పడిఉన్నాయి. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసీపీ ప్రభుత్వం వస్తే వీటిని వినియోగించే వీలుంటుంది. లేకుంటే, ఇన్ని లక్షల రూపాయలతో ముద్రించిన కరపత్రాలు, బుక్‌లెట్‌లు చెత్తపాలుకానున్నాయి. జ్ఞానాపురం జోనల్ కార్యాలయంలోనే వందకు పైగా బాక్సుల్లో కరపత్రాలు మిగిలిపోయాయి. ఈ జోన్ పరిధిలో ఉన్న 120 సచివాలయాలకు అవసరానికి సిద్ధం చేసిన బుక్‌లెట్లు, కరప త్రాలు ముద్రించాల్సి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు . ఆడుదాం ఆంధ్రా అంటూ బలవంతంగా క్రీడా పోటీలునిర్వహించిన ప్రభుత్వం లెక్కకు మించి వీటికి సంబంధించి టోపీలు, టీషర్టులు ముద్రించింది. ఇవన్నీ వృథాగా పడి ఉన్నాయి. ప్రజాధనాన్ని అధికారులు ఎలా దుర్వినియోగం చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన

భీమునిపట్నం (రూరల్), మార్చి 25 : మండలంలోని పలు గ్రామాల్లో క్రైమ్ పోలీసులు నేరాల నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.ముఖ్యంగా పాత నేరస్తులు, రౌడీ షీటర్ల వివరాలతో కూడిన ఫొటోలతో ఫ్లెక్సీ కట్టించి, వాటిని గ్రామాల్లోని ముఖ్య కూడళ్ల ఉంచి స్థానికులకు జాగ్రత్తలు చెబుతున్నారు. రౌడీ షీటర్లు గతంలో చేసిన దౌర్జన్యాలు, కేసులు వంటి అంశాలను వివరిస్తున్నారు. వారి కదలికలు అనుమానాస్పదంగా ఉన్నా, ఇబ్బందికరంగా ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలని కోరుతున్నారు.

ఘనంగా అష్టలక్ష్మీ హోమం



లక్ష్మీనారాయణులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

కొమ్మాది, మార్చి 25 : అన్నంరాజునగర్‌లోని అష్టలక్ష్మీ దేవాలయంలో లక్ష్మీ జయంతి సోమవారం ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు చామర్తి శ్రీధరస్వామి ఆధ్వర్యంలో ఉదయం అష్టలక్ష్మీ హోమం నిర్వహించి, లక్ష్మీనారాయణులకు పంచామృతాభిషేకాలు జరిపారు. సాయంత్రం అష్టలక్ష్ములను ఒకేసింహాసనంపై ఉంచి మహిళలతో సామూహిక కుంకుమార్చనలు, సహస్ర దీపాలంకరణ, సువర్ణ పుష్పార్చన, తులసీ దళార్చన, పుష్పాభిషేకం నిర్వహించారు. అనంతరం ఉయ్యాలసేవ జరిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్తలు అన్నంరాజు సత్యనారాయణ, రమాదేవి దంపతులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నేడు పైడితల్లమ్మ ప్రధాన ఉత్సవం



ఆరిలోవ, మార్చి 25 : ఆదర్శనగర్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న 20 గ్రామాల ఆరాధ్య దేవత పైడితల్లమ్మ ప్రధానోత్సవం మంగళవారం జరగనుంది. ఈమేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. వేకువజామున అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం భక్తులను దర్శనాలకు అనుమతిస్తారు. సాయంత్రం ఉత్సవ విగ్రహం ఊరేగింపు ఉంటుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. కాగా భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించారు. ఉదయం 7 నుంచి ఆదర్శనగర్ వెళ్లే వాహనాలను హనుమంతవాక జంక్షన్ నుంచి పెదగదిలి మీదుగా రవీంద్రనగర్ వైపు మళ్లిస్తున్నారు. రాత్రి 10 వరకు వాహనాలు ఈ మార్గంలోనే రాకపోకలు సాగించనున్నాయి.

డ్రగ్స్‌కు అడ్డాగా విశాఖ : ప్రణవ్

ఎంవీపీ కాలనీ, మార్చి 24 : వైసీపీ ప్రభుత్వం విశాఖను డ్రగ్స్‌కు అడ్డాగా మార్చేసిందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ ప్రణవ్ గోపాల్ ఒక ప్రకటనలో ఆరోపించారు. మొన్న గంజాయి, నిన్న డ్రగ్స్, నేడు తుపాకీలు బయట పడడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఉత్తరాంధ్రను డ్రగ్స్‌తోనూ, రాయలసీమను ఫ్యాక్షనిజంతోనూ, కోస్తాను కబ్జాలతో సర్వనాశనం చేశారని విమర్శించారు. నియోజకవర్గాలకు తమ పత్రిక వాహనాల్లో డబ్బులు తీసుకువెళుతున్నా... అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పోలీసులు ముఖ్యమంత్రి, మంత్రుల వాహనాలను తనిఖీ చేయడం లేదని, డీజీపీని మార్చితేనే రాష్ట్రంలో అరాచకాలు ఆగుతాయన్నారు.

'కాంగ్రెస్‌కు పూర్వ వైభవం'

భీమునిపట్నం, మార్చి 25 : భీమిలి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి అందరూ ఐక్యంగా పనిచేయాలని పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం వారు బీచ్‌రోడ్‌లో వున్న ఒక హోటల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సవరవల్లి రామకృష్ణ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆదరిస్తారన్న నమ్మకం ఉందని చెప్పారు. అధిష్ఠానం ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా గెలుపునకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో పడాల రమణ, గాదం మహేష్ పల్లా వెంకటరావు, గరే వెంకటరమణ మనోహర్ నాయుడు, కదిరి జగన్, అనుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **ఓం భీం బుష్ :** మెలోడి, సంగం, కామేశ్వరి, శారద, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), దుర్గ (మధురవాడ), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
● **భీమా :** రమాదేవి, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), హెవెన్ (గాజువాక), రాములమ్మ (తగరపువలస)
● **లైన్ మ్యాన్ :** లీలామహల్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక)
● **యమధీర :** మౌర్య (గోపాలపట్నం)
● **గామి :** జగదాంబ, లక్ష్మీకాంత్ (గాజువాక)
● **ప్రేమలు :** శ్రీవెంకటేశ్వర, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), లక్ష్మి (గాజువాక), నటరాజ్ (పెందుర్తి), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సప్తగిరి (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 23, టమాటా 12, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 24, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 28, బీరకాయలు 38, ఆనపకాయలు 12, కాలీఫ్లవర్ 20, క్యాబేజ్ 18, క్యారెట్ 28, దొండకాయలు 20, బంగాళా దుంపలు 20, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 38, అల్లం (పాతది) 144, బరబటి 20, ముల్లంగి 16, నిమ్మకాయలు (కిలో) 90, గోరుచిక్కుడు 34, దోస కాయలు 20, వెల్లుల్లి (పెద్దవి) 144, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్ (పెన్సిల్) 50, ఆగాకర 52, పొటల్స్ 70, కీరదోస 24, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 46, చిలగడదుంపలు 30, కంద 60, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 55, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 35.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	415
విజయనగరం	419
శ్రీకాకుళం	419

చికెన్ ధరలు

బ్యాగ్		
రైతు ధర	--	107
ఫారం ధర	--	127
విత్ స్కిన్	--	224
స్కిన్‌లెస్	--	234

మరికొన్ని సిటీ వార్తలు పేజీ III లో..

తారురోడ్డే..మట్టిలా మారింది !

- అధ్వానంగా సంగివలస రహదారి
- తాగునీటి పైప్‌లైన్ గోతుల తవ్వకం ఫలితం
- ప్రమాదా బారిన వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

తగరపువలస, మార్చి 25 : తగరపువలస జాతీయ రహదారి నుంచి సంగివలస మీదుగా సామేయవలస, పాండ్రంకి వరకు ఉన్న తారురోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు మట్టి పేరుకుపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. గతంలో సమీపంలో ఉన్న గోస్తనీ నది నుంచి తాగునీటి పైపులైన్ నిర్మాణానికి రోడ్డు పక్కన గోతులు తవ్వి పైపులు అమర్చారు. అనంతరం మట్టి పూడ్చి తారు వేయకుండా వదిలేయడంతో రహదారి మొత్తం మట్టితో నిండిపోయింది. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోడ్డులో సగానికి పైగా ఉన్న గోతుల్లోని మట్టి ప్రధాన రహదారిపై పేరుకుపోయి మట్టి రోడ్డు మాదిరిగా తయారైంది. కిలో మీటరు వరకూ ఇదే పరిస్థితి ఉంది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి రోడ్డు మరింత బురదమయంగా తయారైంది. పద్మనాభం మండలంలోని పాండ్రంకి, మునివానిపాలెం తదితర గ్రామస్తులతో ఆనందపురంలోని బోని, శిర్లపాలెం వంటి గ్రామాలకు చెందిన వారు తగరపువలస రావాలంటే ఇదే దగ్గరి మార్గం. దీంతో ఈ రోడ్డులో వాహనాల రద్దీ అధికం. రోడ్డు అధ్వానంగా ఉండడంతో ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



రోడ్డుపై పేరుకుపోయిన మట్టి



జోడుగుళ్లపాలెం తీరం వెనక్కి వెళ్లడంతో రాళ్లపై కనిపిస్తున్న పచ్చని సోయగం

శిలలపై తివాచీ

శిలలపై పచ్చటి తివాచీ పరిచినట్టు కనిపిస్తున్న ఈ దృశ్యం జోడుగుళ్లపాలెం తీరంలో ఆవిష్కృతమైంది. సోమవారం ఉదయం పౌర్ణమి కావడంతో ఆటుపోట్లకు సముద్రం సుమారు వంద మీటర్లు వెనక్కి వెళ్లింది. దీంతో సముద్రంలోని రాళ్లపై ఉన్న పచ్చని మొక్కలు గ్రీన్‌మేట్‌లా కనిపించాయి. బీచ్‌కు వచ్చిన సందర్శకులు దీన్ని ఆసక్తిగా తిలకించారు. చాలా మంది ఫొటోలు దిగుతూ సందడి చేశారు.

విశాలాక్షినగర్, ఆంధ్రజ్యోతి

'సూపర్ సిక్స్'తో అన్ని వర్గాలకు మేలు

- తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి
- పదో వార్డులో 'భవిష్యత్తుకు గ్యారంటీ'

ఆరిలోవ, మార్చి 25 : టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల వల్ల రాష్ట్రంలోని అన్ని వర్గాలలకు మేలు జరుగుతుందని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. సోమవారం పదో వార్డు కార్పొరేటర్ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఆదర్శనగర్ కొండవాలు ప్రాంతంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరిస్తూ.. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, చంద్రబాబును సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ ఇన్‌చార్జి మద్దిల రాజశేఖర్, వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, వార్డు కార్యదర్శి కేతా సత్యన్నారాయణ, కొండమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి రాజేష్, ధనలక్ష్మి, జనసేన నానాయకులు బండి రాజా రమేష్, అన్నం తిరుపతిరావు, బీజేపీ నాయకులు కేవీ రమణ, వెంకటేశ్వరరావు, అప్పారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే వెలగపూడికి హారతి పడుతున్న మహిళలు

ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు

భీమునిపట్నం, మార్చి 25 : పట్టణంలోని కృష్ణా కాలనీ సాగర తిరుమల క్షేత్రంపై వెలసిన పద్మావతి, గోదా సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ద్వాదశ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈనెల 19 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు వారం రోజుల పాటు వైభవంగా నిర్వహించారు. చివరిరోజు ఉదయం అయిదున్నర నుంచి సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు అనంతరం కొట్నాలోత్సవం, నవ కలశ స్థాపన, తిరుమంజనం, ధ్రువమూర్తికి గోస్తనీ సాగర సంగంలో చక్ర తీర్థోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి ప్రత్యేక వాహనంపై స్వామివారి ధ్రువ మూర్తిని భక్తుల గోవింద నామ స్మరణలతో చిన్నబజారు, కాలేజీ రోడ్, గంట స్తంభం, పాత బస్టాండ్ మీదుగా సాగర సంగమ తీరానికి ఊరేగింపుగా తీసుకు వచ్చారు. సాయంత్రం అన్నకూటోత్సవం, ద్వాదశ ఆరాధనలు, నిత్య హోమములు, మహాపూర్ణాహుతి, అష్టదిక్పాలక ఉద్వాసన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి పుష్పయాగం, ఏకాంత సేవ జరిపారు. ఆలయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో సంఘం అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, ప్రధాన కార్యదర్శి ధనాలకోటి చందు, గౌరవాధ్యక్షుడు ఆదిమూలం నాగరాజు, కోశాధికారి ముమ్మిడిశెట్టి సత్యానందరావు, నాయకులు కె. ముత్యాలరావు, హెచ్. హరి, బి.బాలాజీ, కె.లక్ష్మీనారాయణ, ఆర్‌వీ అప్పలనరసయ్య, శంకర్, ఆనంద్, అప్పన్న, కొండబాబు పాల్గొన్నారు. కాగా ఉత్సవం ముగింపు కార్యక్రమానికి నెల్లిమర్ల పీఠానికి చెందిన చైతన్య చిన్నస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాత్రి జరిగిన అన్నకూటోత్సవానికి ఆయన హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మానవ జీవితం ప్రశాంతంగా, సత్ప్రవర్తనతో సాగడానికి ఆధ్యాత్మికతత్వం అలవర్చుకోవాలన్నారు.



సాగర తీరంలో ధ్రువమూర్తికి చక్ర తీర్థోత్సవం



జోడుగుళ్లపాలెం తీరంలో స్నానాలు చేస్తున్న యువత



కృష్ణా కళాశాల రోడ్డుపై విద్యార్థుల సందడి

వాడవాడలా హోలీ సందడి

విశాలాక్షినగర్/సాగర్‌నగర్, మార్చి 25 : జీవీఎంసీ 8, 9 వార్డుల్లో హోలీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కాలనీలు, అపార్ట్‌మెంట్లు, రహదారులపై యువత రంగులు పూసుకొని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ సందడి చేశారు. అనంతరం జోడుగుళ్లపాలెం తీరంలో స్నానాలు చేస్తూ సంతోషంగా గడిపారు. కాగా బీచ్ రోడ్డులో కొందరు యువత మద్యం తాగి బైక్‌లతో ఇష్టానుసారంగా విన్యాసాలు చేయడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీసుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు పెద్ద పెద్ద కేకలు వేస్తూ రహదారిలో వాహనదారులను భయభ్రాంతులకు గురిచేశారు.

సింహాచలం : జీవీఎంసీ 98వ వార్డు పోస్టాఫీసు వీధి, గోశాల లేఅవుట్ తదితర ప్రాంతాల్లోనూ హోలీ ఘనంగా నిర్వహించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా గడిపారు. సింహాద్రినాథుని డోలోత్సవంలో భాగంగా కొందరు దేవస్థానం సిబ్బంది స్వామివారి గ్రామ తిరువీధిలో రంగులు చల్లుకుంటూ వేడుక చేసుకున్నారు.

వెంకోజీపాలెం/ఆరిలోవ : జీవీఎంసీలోని అన్ని వార్డుల్లోనూ చిన్నారుల నుంచి పెద్దల వరకు రంగులను వేసుకుని సరదాగా గడిపారు. దీంతో రోడ్లన్నీ రంగులమయమయ్యాయి. యువత కేరింతలు కొడుతూ రంగులతో ద్విచక్ర వాహనాలపై ఊరంతా చక్కెర్లు కొట్టారు. మహిళలు కూడా రంగులు చల్లుకుని సరదగా చిందులేశారు. ఆరిలోవ, పెదగదిలి, చినగదిలి, ఆదర్శనగర్, రవీంద్రనగర్, శ్రీకృష్ణాపురం, పైనాపిల్‌కాలనీ తదితర ప్రాంతాల్లోనూ హోలీ ఘనంగా జరిపారు.

మంచుతో రాలిపోతున్న మామిడి పిందెలు

పద్మనాభం (రూరల్), మార్చి 25 : మంచు వల్ల మామిడి పిందెలు రాలిపోతున్నాయి. రైతులకు ఈఏడాది దిగుబడి లేక పెట్టుబడులు కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు. సాధారణంగా డిసెంబరు, జనవరి నెలల్లో మామిడి పూత వస్తుంది.ఈసారి మార్చి నెల వచ్చినా పూత పూస్తూనే ఉంది. మామిడికి వాతావరణం అనుకూలిస్తేనే సరైన సమయంలో పూత వస్తుంది. ఈ ఏడాది మంచు అధికంగా కురవడంతో భూమిలో ఉష్ణోగ్రతలు తగ్గి మార్చి నెలలో కూడా పూత వస్తూనే ఉంది. మంచుకు తోడు ఎండలు అధికం కావడంతో పూత, పిందెలు రాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూత నిలిపేందుకు మందులు పిచికారీ చేసినా.. తెనె మంచు పురుగు ఆశించడంతో నియంత్రించేందుకు మళ్లీ మందులు కొట్టాల్సి వస్తోంది. పదే పదే మందులు పిచికారీ చేయడం వల్ల రైతులకు భారీగా వ్యయం అవుతుంది. రెండేళ్లుగా రైతులు మంచి దిగుబడి వచ్చి లాభాలు పొందగా ఈసారి మాత్రం ఆశించన మేర దిగుబడి లేక నష్టాలు వచ్చే పరిస్థితి నెలకొంది.

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ దుకాణాలు

పద్మనాభం (రూరల్), మార్చి 25 : గ్రామాల్లో బెల్ట్ దుకాణాలను విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అధికార పార్టీ నేతల అండతో మరిన్ని బెల్ట్ దుకాణాలు వెలుస్తున్నాయి. వీటికి ప్రభుత్వ దుకాణాల నుంచి యథేచ్ఛగా మద్యం సరఫరా అవుతోంది. మండలంలో ఆరు ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండగా వాటి పరిధిలో వంద వరకూ బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తున్నారు. మద్యం దుకాణాల వద్ద ఒక వ్యక్తికి మూడు సీసాలు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. అయితే నేతల ఒత్తిడితో మద్యం షాపుల్లో సీసాకు అదనంగా రూ.10 తీసుకుని అడిగినన్ని సీసాలు ఇస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. చాలాచోట్ల వైసీపీ నేతలు బెల్టు షాపుల నిర్వహణకు వేలం పాట పెట్టి షాపులు నిర్వహిస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

ఘనంగా అయ్యప్ప జన్మదిన వేడుకలు



పద్మనాభంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

భీమునిపట్నం, మార్చి 25 : బీచ్ రోడ్‌లో వున్న అయ్యప్పస్వామి దేవాలయం, ధ్యాన మందిరంలో శ్రీ వీరాంజనేయ అయ్యప్పస్వామి సేవాసంఘం ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ధ్యాన మందిరంలో ఉన్న స్వామివారిని పుష్పాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపి, భక్తులను దర్శనాలకు అనుమతించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు కొమ్మినేని ఎర్రునాయుడు, ప్రధాన కార్యదర్శి మొకర నర్సింగరావు, కోశాధికారి పిల్లి శ్రీను, ఉపాధ్యక్షుడు కదిరి జగన్నాథం, ముఖ్య సలహాదారు గుగ్గిళ్ళ సాయి, పురోహితులు సుసరాపు కామేశ్వర మాధవ శాస్త్రి పాల్గొన్నారు.

మద్ది, పద్మనాభంలో...

పద్మనాభం : మద్ది గ్రామంలో ధర్మశాస్త్రా సేవా పీఠం ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి జన్మదిన వేడుకలు వైభవంగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, అయ్యప్పస్వామికి పంచామృతాభిషేకం, గణపతి హోమం, అయ్యప్ప హోమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నెల్లిమర్ల దుర్గా పీఠం స్వామీజీ శ్రవణ చైతన్యానంద ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ ఛైర్మన్ గిరిబాబు, ఎంపీపీ రాంబాబు, వైసీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణరావు, యువజన విభాగం అధ్యక్షుడు సత్యనారాయణ పాల్గొన్నారు.అలాగే పద్మనాభంలోని అభయాంజనేయస్వామి ఆలయం వద్ద స్థానిక అయ్యప్ప పీఠం ఆధ్వర్యంలోనూ అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు నిర్వహించారు.పటం పూజ చేసి, స్వామికి విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం స్వామి నామాలను పారాయణ చేశారు. ఉత్సవంలో భాగంగా 110 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఠం గురుస్వాములు ఆల్తి రాజు, తాలాడ శ్రీను, బంగారునాయుడు, డి. రమణ, పద్దరాజు, ఉపేంద్ర, పీఠం సభ్యులు శ్రీనివాసరావు, సూర్యం, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వెంకోజీపాలెం : కొత్త వెంకోజీపాలెంలోని గౌరీ జ్ఞానలింగేశ్వరాలయంలో వేంచేసి ఉన్న శ్రీ ధర్మశాస్త అయ్యప్పస్వామి ఆలయంలోనూ వేడుకలు నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి సూర్య ప్రకాష్‌శర్మ, సుబ్రహ్మణ్యశాస్త్రి, బాల భాస్కరశర్మ ఆధ్వర్యంలో ముందుగా స్వామివారికి పూజలు జరిపి, విశేషాలంకరణతో భక్తులకు దివ్య దర్శనాన్ని కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వద్ద ప్రత్యే కంగా మండపాన్ని ఏర్పాటు చేసిన భజనలు చేశారు. మధ్యాహ్నం గ్రామ సేవా సంఘం ఆధ్వర్యంలో మహా అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టీడీపీ నాయకులు బోర ధనరెడ్డి, కాళ్ల శంకర్, సంఘం అధ్యక్షుడు పీల రమణ, ఆడారి కామేశ్వరరావు, మద్దాల వీర వెంకట అప్పారావు, ఎస్. నరసింహారెడ్డి, పీల జోష్యుల, ఆడారి శ్రీనివాస్, మద్దాల భాను, కస్తూరి పాల్గొన్నారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంతానాభివృద్ధికి చర్యలు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

వెంకోజీపాలెం, మార్చి 25 : నగరంలోని అన్ని బీచ్‌లలోనూ ఆలివ్ రిడ్లే తాబేళ్ల సంతానోత్పత్తికి సంరక్షణ చర్యలు చేపడుతున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీవీఎంసీ పరిధిలోని అన్ని బీచ్‌లలో ఎకో వైజాగ్ కార్యక్రమంలో ఎకో బ్లూ ద్వారా బీచ్‌లలో మెకానికల్ బీచ్ క్లీనింగ్ యంత్రాలతో పరిశుభ్రత పనులు చేపడుతున్నామని చెప్పారు. ఆలివ్ రిడ్లే తాబేళ్లు తీర ప్రాంతాల్లో ఏటా అక్టోబరు, నవంబరు నెలల్లో వలస వచ్చి గుడ్లు పెట్టి, వాటి సంతానాన్ని వృద్ధి చేసుకుని మళ్లీ మే నెలలో వాటి పిల్లలతో సముద్రంలోకి చేరుకుంటాయని తెలిపారు. ఈమేరకు తాబేళ్ల సంరక్షణకు ఆర్‌కే బీచ్, సాగర్‌నగర్, చేపల ఉప్పాడ, పెద నాగమయ్యపాలెం తీర ప్రాంతాల్లో మెకానికల్ బీచ్ క్లీనింగ్‌కు బదులు మే నెలాఖరకు వరకు మాన్యువల్ పద్ధతిలో పారిశుధ్య కార్మికులతో పరిశుభ్రతా పనులు చేపడతామని చెప్పారు. సందర్శకులు వ్యర్థాలను బీచ్‌లలో పడవేయకుండా సమీపంలోని డస్ట్ బిన్లలో వేయాలని కోరారు.

ఇద్దర్ని రక్షించిన లైఫ్‌గార్డులు



విద్యార్థులను రక్షించిన లైఫ్‌గార్డులు

బీచ్ రోడ్డు, మార్చి 25 : ఆర్‌కే బీచ్‌లో సముద్ర స్నానాలకు దిగి ప్రమాదానికి గురైన ఇద్దరు విద్యార్థులను లైఫ్‌గార్డులు రక్షించారు. హరిగోపాల్ స్కూల్లో ఎనిమిదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హోలీ కావడంతో సోమవారం ఉదయం పాండురంగాపురం డౌన్ బీచ్‌కు వచ్చారు. ఒడ్డున కాసేపు రంగులు పూసుకుని స్నానానికి సముద్రంలోకి దిగారు. అలల తాకిడి పెరగడంతో కౌషిక్, బషీర్ సముద్రంలోకి కొట్టుకుపోయారు. దీన్ని గమనించిన లైఫ్‌గార్డులు జె. హరీష్ ఎం. నవీన్, బి. అరవింద్, పి. అచ్చన్న, ఎం. కిషోర్ సముద్రంలోకి వెళ్లి ముందుగా ఒడ్డుకు దగ్గరగా ఉన్న కౌషిక్‌ను బయటకు తీసుకువచ్చారు. తరువాత అలల్లో కొట్టుకుపోతున్న బషీర్‌ను ఒడ్డుకు తీసుకువచ్చారు. ఇద్దరూ నీళ్లు ఎక్కువగా తాగడంతో అక్కడే సీపీఆర్ చేసి కేజీహెచ్‌కు తరలించారు. విద్యార్థులను రక్షించిన లైఫ్‌గార్డులను జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, త్రీ టౌన్ సీఐ పార్థసారధి, తదితరులు అభినందించారు.

104 మందికి కళ్లద్దాలు పంపిణీ



రోగులకు కళ్లద్దాలు అందిస్తున్న బీఎన్‌డబ్ల్యూ సభ్యులు

భీమునిపట్నం, మార్చి 25 : పట్టణంలోని ది సన్ స్కూల్ ఆవరణలో సీడీ వెల్ఫేర్ ఆధ్వర్యంలో 104 మందికి సోమవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. బీఎన్‌డబ్ల్యూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ నేత్ర వైద్యుడు ఎస్ఎల్ రావు మాట్లాడుతూ గత నెలలో తమ సంస్థ నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్న వారిలో 104 మందికి కళ్లద్దాలు అవసరమని గుర్తించి, పంపిణీ చేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ముసునూరి సూర్యశ్రీనివాస్, కాళ్ల సన్నీ, వెంపాడ శ్రీనివాస్‌రెడ్డి, వాండ్రాసి సతీష్, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

హిందీ సర్టిఫికెట్లు అందజేత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న గంటా నూకరాజు

భీమునిపట్నం, మార్చి 25 : చెన్నైకు చెందిన దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో గత నెల 10,11 తేదీల్లో నిర్వహించిన హిందీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి ఆదర్శ హిందీ ప్రేమ మండలి సభ్యులు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. బీచ్ రోడ్‌లోని జీఎస్ఆర్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంస్థ గౌరవాధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడుతూ విద్యార్థులు తెలుగుతో పాటు హిందీని కూడా అభ్యసించాలన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎస్ఆర్ కృష్ణారావు మాట్లాడుతూ పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్రభాష, ప్రవేశిక పరీక్షలకు మొత్తం 77 మంది హాజరుకాగా, శతశాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. అలాగే హయ్యర్ గ్రేడ్ పరీక్షలైన విశారద, ప్రవీణ, పూర్వార్ధ, ఉత్తరార్ధలకు 12 మంది హాజరుకాగా, 11 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు.

బీజేపీ విశాఖ పార్లమెంట్ మెడికల్ సెల్ కన్వీనర్‌గా వెంకటేశ్వరరావు

ఆరిలోవ, మార్చి 25 : ఆదర్శనగర్‌కు చెందిన కేవీ వెంకటేశ్వరరావు బీజేపీ విశాఖ పార్లమెంట్ మెడికల్ సెల్ కన్వీనర్‌గా నియామితులయ్యారు. సోమవారం ఆయన నగరంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర చేతుల మీదుగా ఉత్తర్వులు అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు.


రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఆరిలోవ, మార్చి 25 : జూ పార్కు సమీపంలో ఆగి ఉన్న బొలేరో వాహనాన్ని బైక్ ఢీకొనడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ద్వారాకా ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒక యువకుడు, ఇద్దరు యువతులు హోలీ పండుగ చేసుకొని జూ మీదుగా ఎండాడ వైపు వస్తుండగా అదే మార్గంలో జాతీయ రహదారి పక్కన నిలిపి ఉన్న బొలేరో వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను విమ్స్‌లో చేర్పించినట్టు సీఐ తెలిపారు. కేసును ఆరిలోవ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు.

జి-సెప్‌తో గీతం ఎంఓయూ

సాగర్‌నగర్, మార్చి 25 : మేథో హక్కులపై (ఐపీ) బోధన, పరిశోధన, సదస్సులు, వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి గోవాలోని గోవా సెంటర్ ఫర్ ఎక్స్‌లెన్స్ ఇంటలెక్చువల్ ప్రాపర్టి (జి-సెప్)తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం సోమవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా గీతం స్కూల్ ఆఫ్ లా డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్. అనితారావు సమక్షంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్, జి-సెప్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఉమేష్ బనకర్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు.

'రాష్ట్ర భవిత కోసం కలిసికట్టుగా పనిచేద్దాం'



మాట్లాడుతున్న వెలగపూడి రామకృష్ణబాబు

పెదవాల్తేరు, మార్చి 25 : ఉత్తరాంధ్ర అభివృద్ధికి, రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి కట్టుగా పనిచేయాలని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కోరారు. సోమవారం ఆయన నగరంలోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా వెలగపూడి మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు తూర్పు నియోజకవర్గం నుంచి ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ బీజేపీ, టీడీపీ, జనసేన సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కేతినేని సురేంద్ర మోహన్, సీనియర్ నాయకులు ప్రకాష్‌రెడ్డి, ఎన్.విజయేంద్రరెడ్డి, రాష్ట్ర ఆర్‌టీఐ సెల్ కన్వీనర్ వెంగమాంబ శ్రీనివాస్‌బాబు పాల్గొన్నారు.